
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
5
ఆదివారం 2 నవంబరు 2025



సమష్టిగా శ్రమించి
ఉన్నతంగా తీర్చిదిద్దుతాం

- సత్తుపల్లి ఏరియా జీఎం చింతల శ్రీనివాస్
- జనరల్ మేనేజర్‌గా బాధ్యతల స్వీకరణ

6



సింగరేణి మైన్‌ను సందర్శించిన జీఎం చింతల శ్రీనివాస్

సర్వేకు సన్నద్ధం

- 'మొంథా' మిగిల్చిన నష్టంపై వ్యవసాయశాఖ అంచనాలు
- లెక్కలు తేల్చే పనిలో అధికారులు నిమగ్నం
- 62,400ఎకరాల్లో పంటలు ధ్వంసమైనట్లు ప్రాథమిక నివేదిక

ఖమ్మం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మొంథా తుఫాన్‌తో అంతా అస్తవ్యస్తమైంది. చేతికొచ్చే దశలో ఉన్న వరి, పత్తి పంటలు నీటిపాలయ్యాయి. దీంతో రైతులకు కన్నీరే మిగిలింది. అయితే తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.10వేల పరిహారం ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలోనే వ్యవసాయశాఖ అధికారులు పూర్తిస్థాయి సర్వేకు సన్నద్ధమయ్యారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ గణాంకాల సేకరణలో నిమగ్నమయ్యారు. అయితే వ్యవసాయశాఖ ప్రాథమిక అంచనా ప్రకారం ఖమ్మం జిల్లాలో 40,104మంది రైతులకు సంబంధించి 62,400ఎకరాల్లో పలు పంటలకు నష్టం వాటిలినట్టు నివేదిక అందించారు. అందులో 24,321మంది రైతులకు చెందిన 36,893 ఎకరాల వరి, 16,544మంది రైతులకు చెందిన 22,574 ఎకరాల పత్తి, ఐదుగురు రైతులకు చెందిన 10 ఎకరాల్లో పప్పుధాన్యాల పంటలు, 2,234మంది రైతులకు చెందిన 2,923 ఎకరాల్లో మిర్చితో పాటు ఇతర కూరగాయల పంటలు ఉన్నట్టు తేలింది.



కూసుమంచి మండలం మల్లేపల్లిగ్రామంలో వర్షపునీరు తొలగించేందుకు జాలుకాల్వ తీస్తున్న రైతులు



తల్లాడలో పడిపోయిన మిర్చి మొక్కలు లేపుతున్న రైతులు

సర్వే నెంబర్ల ప్రకారం.. అంచనా..

క్షేత్రస్థాయిలో సర్వేనెంబర్ల ప్రకారం జరిగిన పంటనష్టం, ఫొటోలు, రైతుపేరు, ఎంత శాతం దెబ్బతిన్నది తదితర గణాంకాలతో దెబ్బతిన్న పంటల వివరాలు సేకరించబోతున్నారు. ఇప్పటికే ఎకరానికి రూ.10వేలు పరిహారం అందిస్తామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. ఈ నేపథ్యంలో రైతుల వారీగా పంటల వారీగా జాబితా సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదిక అందించబోతున్నారు. వాస్తవానికి ప్రస్తుతం పంటలన్నీ చేతికొస్తున్న సమయంలో తుఫాన్‌తో పంటలు గణనీయంగా దెబ్బతిన్నాయి. అయితే ప్రత్యక్ష నష్టంకంటే పరోక్షనష్టమే అధికంగా ఉంది. జిల్లాలో సుమారు రెండున్నర లక్షల ఎకరాల్లో వేసిన.. పత్తి నీరుపట్టడం, నల్లబడడం, నాణ్యత దెబ్బతినడంతో దిగుబడులు, ధరపై ప్రభావం చూపనుంది. అలాగే వరిపంట కూడా సుమారు 3లక్షల ఎకరాల్లో సాగు చేయగా.. అంతా కోత, పొట్టదశలో ఉంది. గాలికి నేలవారింది. మొక్కజొన్న, మిర్చి తదితర పంటలు కూడా దెబ్బతిన్నాయి. ఈ క్రమంలో ఎకరానికి రూ.25వేలకు పైగా పెట్టుబడులు పెట్టిన రైతులకు తుఫాన్‌వల్ల తీవ్ర నష్టం కలిగించింది. ప్రభుత్వం ఆదుకుంటేనే కోలుకుంటామని (మిగతా 6వ పేజీలో)

చేతికొచ్చిన పంట కోల్పోయా

చింతలపాటి సత్యం, రైతు, మల్లవరం, తల్లాడ మండలం



ఆరెకరాల్లో పత్తి వేశా. ఇందులో నాలుగెకరాలు కౌలుకు తీసుకుని ఎకరానికి రూ.25వేల చొప్పున చెల్లించా. పత్తి వేసేందుకు ఎకరానికి రూ.40వేలు పెట్టుబడి పెట్టా. పత్తితీసే దశలో ఉంది. తుఫాన్‌తో పత్తికాయలు రాలిపోయాయి. దూదిపింజలు తడిచి రంగుమారాయి. తుఫాన్‌తో నష్టపోయిన మమ్మల్ని ప్రభుత్వం ఆదుకుంటే తప్ప కోలుకోలేం.

పాలేరులో నేడు
మంత్రి పొంగులేటి పర్యటన

దెబ్బతిన్న పంటలను పరిశీలించనున్న శ్రీనివాసరెడ్డి



కూసుమంచి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం పాలేరు నియోజకవర్గంలో పర్యటించనున్నారు. తుఫాన్ కారణంగా దెబ్బతిన్న పంటలను ఆయన పరిశీలించనున్నారు. సాయంత్రం హైదరాబాద్ నుంచి బయలుదేరి 4గంటలకు కూసుమంచి చేరుకోనున్న ఆయన తొలుత జక్కేపల్లి గ్రామంలో నీటమునిగిన పంటలను పరిశీలించి.. నష్టపోయిన రైతులను ఓదార్చనున్నారు. 4:30గంటలకు నేలకొండపల్లి మండలం ఆరెగూడెంలో పర్యటిస్తారు. అనంతరం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని కేబీఆర్ నగర్, జలగం నగర్ ప్రాంతాల్లో మున్నేరు వరదతో జరిగిన నష్టాన్ని పరిశీలించనున్నారు. అనంతరం ఖమ్మంరూరల్ కామంచికల్‌లో అంతర్గత సీసీ రోడ్లనిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు.

'తుఫాన్' నష్టంపై సమగ్ర నివేదికలివ్వండి

- క్షేత్రస్థాయిలో పర్యటించి పక్కాగా అంచనాలు రూపొందించాలి
- అధికారులతో టెలీకాన్ఫరెన్స్‌లో ఖమ్మం కలెక్టర్ అనుదీప్



ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో పర్యటించి ఇటీవలి మొంథా తుఫాన్ కారణంగా జరిగిన నష్టం అంచనాలను సిద్ధం చేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ఆయన శనివారం మొంథా తుఫాన్ నష్టం అంచనాలపై జిల్లా అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవ పరిస్థితుల మేరకు ఎక్కడా ఎలాంటి అక్రమాలు, లోపాలకు తావివ్వకుండా నివేదికలను పకడ్బందీగా తయారు చేసి.. నష్టపోయిన ప్రతి ఒక్కరికీ పరిహారం అందేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో పద్మశ్రీ తదితరులున్నారు.

పంట నష్టం అంచనాలు సిద్ధం చేయండి

- నిర్ణీత నమూనాలో నివేదిక అందించాలి
- అధికారులతో ఖమ్మం అదనపు కలెక్టర్ల సమీక్ష

6

సామినేని హత్య..
సుపారీ గ్యాంగ్ పనేనా?

- పలు కోణాల్లో దర్యాప్తు ముమ్మరం
- సీసీ పుటేజీలను జల్లెడ పట్టిన పోలీసులు
- గ్రామంలో అపరిచిత వ్యక్తులు సంచరించినట్టు ఆధారాలు!



గ్రామంలో పోలీసుల పహారా

చింతకాని, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఖమ్మం జిల్లా చింతకాని మండలం పాతర్లపాడు గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు సామినేని రామారావు హత్య కేసు ఛేదనను ఖమ్మం జిల్లా పోలీసులు సవాల్‌గా స్వీకరించారు. శుక్రవారం తెల్లవారుజామున జరిగిన ఈ ఘటన విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం చేయొద్దని, నిందితులను (మిగతా 6వ పేజీలో)

'పేట' పామాయిల్ ఫ్యాక్టరీలో..
అత్యధిక ఓఈఆర్ గర్వకారణం

- 3.30లక్షల గెలల క్రషింగ్ సాధించడం అభినందనీయం
- మంత్రి తుమ్మల ప్రోత్సాహం, అధికారుల కష్టంతో అరుదైన రికార్డులు
- రేవంత్ ప్రభుత్వంలో రైతులకు ఎన్నో ప్రయోజనాలు
- రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, ఆలపాటి
- అధికారులకు ఘనంగా సత్కారం

అశ్వారావుపేట/ దమ్మపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీలో అత్యధిక ఓఈఆర్ (ఆయిల్ ఎక్స్‌టెన్షన్ రేషియో) సాధించడం గర్వకారణమని రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, రాష్ట్ర పామాయిల్ రైతుల వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆలపాటి రామచంద్ర ప్రసాద్ అన్నారు. టీజీ ఆయిల్‌ఫెడ్ అధికారులు ఎన్నో అరుదైన రికార్డులను సాధించి, పామాయిల్‌లో తెలంగాణను జాతీయ స్థాయిలో అత్యుత్తమ స్థాయిలో నిలబెట్టారని.. ఇది మనందరికీ గర్వకారణమన్నారు. ఆయిల్‌ఫెడ్ ఈ అరుదైన రికార్డులను సాధించడంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నిరంతర కృషి, ప్రోత్సాహం, అధికారులు, ఉద్యోగుల కృషిని మరువలేమని అన్నారు. శనివారం దమ్మపేట మండలంలోని అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీలో అత్యధిక ఓఈఆర్ సాధన, 3.30 లక్షల గెలల టన్నుల మేర క్రషింగ్ చేసి అరుదైన రికార్డులను నెలకొల్పిన సందర్భంగా ఆయిల్‌ఫెడ్ అధికారులు, ఉద్యోగులను వారు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయిల్‌పెడ్ చైర్మన్ రాఘవరెడ్డి మాట్లాడుతూ.. ఈ ఆయిల్ ఇయర్‌లో ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలోని అప్పారావుపేట ఫ్యాక్టరీలో 2.30 లక్షల టన్నులు, అశ్వారావుపేట ఫ్యాక్టరీలో లక్ష టన్నుల పామాయిల్ గెలలను క్రషింగ్ చేసి దేశంలోని పామాయిల్ చరిత్రలోనే అత్యధికంగా పామాయిల్ గెలల క్రషింగ్ రికార్డును సాధించడం మనందరికీ గర్వకారణమన్నారు. అలాగే దేశంలోనే అత్యధిక శాతం 20.01శాతం ఓఈఆర్‌ను సాధించడం ద్వారా అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీ అరుదైన రికార్డును సొంతం చేసుకోవడమే కాకుండా.. దేశంలోని పామాయిల్ రైతులందరికీ మంచి ధరను తెచ్చిపెట్టడంలో కీలకంగా మారడం గర్వకారణమన్నారు. ఇందుకు కృషి చేసిన ఆయిల్‌ఫెడ్ అధికారులు, ఉద్యోగుల కృషి మరువలేనిదన్నారు. అలాగే స్వయంగా రైతు అయిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పామాయిల్ తోటలు విస్తరణ, సమస్యల పరిష్కారం, ఫ్యాక్టరీల నిర్మాణం, ధరల నిర్ణయం, రాయితీలను అందించడం ద్వారా పామాయిల్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా మారి ప్రతీ అడుగులో వెన్నంటి ఉండి రాష్ట్రవ్యాప్తంగా తోటలు విస్తరించడంలో ఆయన చేసిన కృషి మనకెంతో గర్వకారణమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతుల ప్రయోజనాల కోసం వేల కోట్లు వెచ్చిస్తోందన్నారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ, రైతు భరోసా, ఉద్యాన పంటలకు రాయితీలు, వరి రైతులకు సన్న బియ్యానికి టన్నుకు రూ.500లు ప్రోత్సాహం, పామాయిల్‌ను ప్రోత్సహిస్తుందన్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించిన సిద్దిపేట పామాయిల్ ఫ్యాక్టరీ త్వరలోనే ప్రారంభం కాబోతుందన్నారు. అలాగే (మిగతా 6వ పేజీలో)



ఆయిల్‌ఫెడ్ అధికారులను సన్మానిస్తున్న ఆయిల్‌ఫెడ్ చైర్మన్, పామాయిల్ రైతు సంఘం అధ్యక్షుడు, నాయకులు

28 అడుగులు దాటిన గోదావరి

భద్రాచలం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎగువన కురిసిన వర్షాలతో భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం గత 48 గంటల్లో పెరుగుతూ వస్తోంది. భద్రాచలం వద్ద శనివారం సాయంత్రం 6 గంటలకు 28 అడుగులు దాటి ప్రవహిస్తోంది. స్నానఘట్టాలపైకి సైతం నీరు చేరింది. మూడు రోజుల క్రితం 15 అడుగులున్న నీటిమట్టం మేడిగడ్డ నుంచి నాలుగు లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు వదలడంతో క్రమంగా పెరుగుతూ వచ్చింది. శుక్రవారం 19 అడుగులున్న గోదావరి శనివారం సాయంత్రానికి 28అడుగులు దాటింది.

ఆధునిక వైద్యం.. అందని ద్రాక్షేనా?

- జిల్లా జనరల్ ఆస్పత్రిలో సౌకర్యాలు మృగ్యం
- ఎంఆర్ఐ సదుపాయం లేక అవస్థలు



ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు మెడికల్ కళాశాల మంజూరవగానే.. జిల్లా ఆస్పత్రిలో ఎన్నో సౌకర్యాలు అందుబాటులోకి వచ్చి రోగులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని అందరూ ఆశించారు. కానీ మెడికల్ ఆస్పత్రికి అనుసంధానంగా ఉన్న జీజీహెచ్‌లో ఆశించినన్ని సేవలు అందడం లేదు. ఈ క్రమంలో జిల్లా ప్రజలకు ఆధునిక వైద్యం అందని ద్రాక్షగా మారింది. జిల్లా జనరల్ ఆస్పత్రిని మెడికల్ కళాశాలకు అనుసంధానం చేయడం ద్వారా పూర్తిస్థాయిలో అభివృద్ధి జరుగుతుందని, అన్ని సేవలు అందుబాటులోకి వస్తాయనుకున్న ప్రజల ఆశలు నిరాశలయ్యాయి. గతంలో వైద్య విధాన పరిషత్ పరిధిలో ఉన్నప్పుడే యూరాలజీ, నెఫ్రాలజీ, న్యూరాలజీ సేవలు అందుబాటులో ఉండేవి. కానీ మెడికల్ కళాశాల అయిన తర్వాత ఈ సేవలన్నీ మూలనపడ్డాయి. పూర్తిస్థాయిలో వైద్యులు లేకపోవడంతో ఆశించిన వైద్యం అందడం లేదు. అయితే పలు రకాల ఆధునిక యంత్ర పరికరాలు ఏర్పాటు చేసినా అత్యవసరమైన ఎంఆర్ఐ యంత్రం అందుబాటులోకి తీసుకురావడాన్ని విస్మరించారు. ఎంతో విలువైన అత్యవసరమైన ఈ పరికరం అదిగో వస్తోంది.. ఇదిగో వస్తోంది.. అంటున్నా నేటికీ కార్యరూపం దాల్చడం లేదు. దీంతో బాధితులను ఈ పరీక్షల కోసం ఇతర ప్రాంతాలకు, ప్రైవేటుకు రిఫర్ చేయాల్సిన దుస్థితి వస్తోంది.

ఎంఆర్ఐ లేక అవస్థలు..

జిల్లా ఆస్పత్రిలో ఎంఆర్ఐ సౌకర్యం లేకపోవటంతో బాధితులు ప్రాణాలు కోల్పోవాల్సి వస్తోంది. జిల్లా జనరల్ ఆస్పత్రికి నిత్యం కనీసం 20మంది వరకు ప్రమాదాల బారిన పడిన క్షతగాత్రులు వస్తుంటారు. వీరికి అవసరమైన సీటీ స్కానింగ్ అందుబాటులో ఉన్నా రేడియాలజిస్టులు లేక ఆపసోపాలు పడుతోంది. అయితే తలకు తీవ్రగాయాల పాలైన క్షతగాత్రులను పరీక్షించేందుకు ఎంఆర్ఐ అవసరం ఉంటుంది. ఈ సౌకర్యం జిల్లా ఆస్పత్రిలో అందుబాటులో లేకపోవడంతో ఇదివరకు మాదిరిగానే హైదరాబాద్, వరంగల్ తదితర ప్రాంతాలకు రిఫర్ చేయాల్సి వస్తోంది. కొందరు బాధితులకు మెదడులో లోపాలు ఏర్పడి అచేతనావస్థకు చేరుకుంటున్నారు. వెంటనే ఎక్స్‌రే తీయిస్తున్నా.. అందులో స్పష్టత లేకపోవటంతో సీటీ స్కాన్ చేస్తున్నారు. ఇందులోనూ సమస్య అస్పష్టంగా కనిపించటంతో ఎంఆర్ఐ విధిగా చేయించాల్సిన పరిస్థితి ఉంటోంది. అయితే జిల్లా ఆస్పత్రిలో ఆ సౌకర్యం అందుబాటులో లేదు. దీంతో ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లాల్సి వస్తోంది. కానీ వైద్యులు అందుబాటులో ఉండకపోవడంతో షరా మామూలుగా వారిని ఇతర ప్రాంతాలకు పంపాల్సి వస్తోంది. ప్రమాదాల బారిన పడినవారు, మెదడుకు సంబంధించిన ఇబ్బందులు ఉన్న బాధితుల స్పష్టమైన వివరాలు తెలియలాంటే ఎంఆర్ఐ చేయాల్సి ఉంటుంది. కానీ జిల్లా ఆస్పత్రిలో ఆ యంత్రం అందుబాటులో లేదు. దీంతో బాధితులు ఈ పరీక్ష కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. అంతేకాదు ఇలాంటి అత్యవసర పరిస్థితుల్లో నిరుపేదలు, మధ్యతరగతి కుటుంబీకులు ఒక్కోసారి ప్రాణాలనే కోల్పోతున్నారు. ఇప్పటికైనా అధికారులు జిల్లాకు చెందిన మంత్రులు దృష్టి సారించి ఖమ్మం జిల్లా జనరల్ ఆస్పత్రికి ఎంఆర్ఐ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

కంప్యూటర్ల మరమ్మతులకు టెండర్ల ఆహ్వానం

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 84 ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న కంప్యూటర్లు మరమ్మతుల కోసం ఆసక్తి కలిగిన వారు నవంబరు 6లోగా టెండర్లు దాఖలు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి కోరారు. 69 ఉన్నత పాఠశాలలకు రూ.15 వేల చొప్పున, 15 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు రూ.5వేల చొప్పున మొత్తం రూ.11లక్షల పదివేలను కేటాయించినట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు డీఈవో కార్యాలయంలో రూ. 4వేలను చెల్లించి దరఖాస్తు ద్వారా రూ. 50వేల డీడీని జిల్లా కలెక్టర్, చైర్మన్ సమగ్రశిక్ష ఖమ్మం పేరిట తీసి టెండర్లు దాఖలు చేయాలని కోరారు.

11న జిల్లా స్థాయి యువజనోత్సవాలు

ఖమ్మం స్పోర్ట్స్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): 29వ జాతీయ యువజనోత్సవాల సందర్భంగా జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఈనెల 11న నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో జిల్లా స్థాయి యువజనోత్సవాలు నిర్వహించనున్నట్లు డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. యువజనోత్సవాలలో భాగంగా 15 నుంచి 29 సంవత్సరాల యువతకు జానపద నృత్యం(గ్రూపు), జానపద గేయం(గ్రూపు), వ్యాసరచన, పోస్టర్‌తయారీ, వకృత్వ పోటీ, కవిత్వం, సైన్స్ మేళా తదితర విభాగాలలో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతిభ చూపి గెలుపొందిన వారిని హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి యువజనోత్సవాలకు, అక్కడ ప్రతిభ చూపిన వారిని న్యూఢిల్లీలో జనవరి 12 నుంచి 16 వరకు జరిగే జాతీయస్థాయి యువజనోత్సవాలలో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తి గల యువతీ యువకులు తమ ఎంట్రీలను ఈ నెల 10 కల్లా జిల్లా యువజన, క్రీడల శాఖ కార్యాలయంలో అందించాలని కోరారు. ఇతర సమాచారం కోసం 99482 07271 నెంబరును సంప్రదించాలని తెలిపారు.

రాపల్లి పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

బోనకల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా డిప్యూటేషన్‌పై పని చేస్తున్న ఎస్. వెంకట్రావమ్మను సస్పెన్షన్ చేస్తూ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఉత్తర్వులను జారీ చేశారు. ఉత్వర్వుల్లోని అంశాల ప్రకారం ఈ ఏడాది జనవరిలో ఆమె రావినూతల పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న సమయంలో గ్రామంలోని కొందరు నిబంధనలు పాటించకుండా నిధులు డ్రా చేసి దుర్వినియోగం చేశారని డీపీవోతో పాటు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎంపీవో విచారణ నిర్వహించి సమగ్ర నివేదికను జిల్లా కలెక్టర్‌కు పంపించారు. ఎంపీవో ఇచ్చిన నివేదిక నివేదిక ఆధారంగా ఆమె పై సస్పెన్షన్ వేటు పడింది.

వరి రైతులపై అదనపు భారం

- పంటను రక్షించుకునేందుకు నానా పాట్లు
- పెట్టుబడులు కూడా రాని పరిస్థితి
- ప్రభుత్వం ఆదుకుంటేనే గట్టెక్కేది
- నేడు మంత్రి పొంగులేటి పరిశీలన


వరి పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

కూసుమంచి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను కారణంగా వరి రైతులపై అదనపు భారం పడుతోంది. మరో వారం పదిరోజుల్లో కోతకు వచ్చిన పంట నేలవాలడంతో ఉన్న కొద్దిపంట రక్షించుకునేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైతులకు ఇది కనిపించని ఆర్థికభారంగా మారింది. నేలవాలిన వరిని లేపి కట్టలు కట్టాలంటే కూలీల ఖర్చు భారంగా మారింది. పడిపోయిన వరి లేపి కట్టడానికి ఎకరాకు కనీసం 10మంది కూలీలు అవసరం, ఒక్కో కూలీకి కనీసం రూ.500 చొప్పున రూ.5000 ఖర్చవుతుంది. అదేవిధంగా నీరు వదిలించేందుకు జాలు కాల్వ తీసేందుకు కూలీకి రూ.1000 ఖర్చవుతోంది. ఒకవేళ కట్టలు కట్టినా కోతసమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

వరిపొలం మిషన్ల ద్వారా కోయాలంటే ఎకరానికి సుమారు గంట సమయం పడుతుంది. అదే నేలవాలిన పొలం కోయాలంటే సుమారు రెండుగంటలకు పైమాటే సమయం పడుతుందని రైతులు వాపోతున్నారు. అంటే మామూలుగా గంట కు రూ.3వేలు ఖర్చవుతుండగా నేలవాలిన పొలానికి రూ.6వేలకు పైగా ఖర్చవుతోంది. దీంతో ఖర్చు రెట్టింపవుతోంది. అదేవిధంగా కొన్ని చోట్ల కట్టలు కట్టడానికి వీలు లేకుండా నీరు బయటకు వెళ్లడం వీలులేని చోట అందులోనే కుళ్లిపోతుంది. అదీ కనీసం ఎకరాకు నాలుగు బస్తాలవరకు ఉంటుంది.

మంచిగా పండిన పొలానికి ఎకరానికి 40బస్తాల వరకు దిగుబడి వస్తుంది. నేలవాలిన పొలాల్లో సుమారు 30 బస్తాల వరకే వస్తుంది. అంటే సుమారు పదిబస్తాల దిగుబడి తగ్గుతుంది. దీనివిలువ సుమారు రూ.20 వేలు ఉంటుంది. అంటే మొంథా తుపాను కారణంగా రైతుకు ఎకరాకు సుమారు రూ.30వేలు నష్టం. అంటే సాధారణంగా ఎకరాకు 40 బస్తాలకు (28క్వింటాళ్లు) దిగుబడి వస్తే రూ.2200 చొప్పున(ప్రైవేటు మార్కెట్‌లో) రూ.62వేలు వస్తాయి. అంటే ఇప్పుడు అదనపు ఖర్చుపోగా మిగిలేది రూ.32 వేలు. ఇందులో పెట్టుబడి ఖర్చులు సుమారు రూ.25వేలు పోతే మిగిలేది కేవలం రూ.వేలు మాత్రమే. ఇక కౌలురైతులకు అదీ మిగలదు. దీంతో రైతుకు రక్తకన్నీరే మిగిలుతోంది.

ప్రతిఏటా ఇదే పరిస్థితి

వరిపండించే రైతుకు ప్రతిఏటా నష్టాల సాగే ఎదురవుతోంది. పంట చేతికందే సమయంలోనో లేదా చేతికొచ్చిన వరిధాన్యం కేంద్రాల వద్ద నిల్వ ఉంచిన అనంతరంభారీ వర్షాలు కురియడంతో తడిచి ముద్దై రైతాంగానికి భారీ నష్టానికి గురవుతున్నారు. వరిధాన్యం కల్లాల వద్ద కుప్ప పోసిన సమయంలో ప్రకృతి తన ప్రభావం చూపెట్టడంతో భారీగా వర్షాలు కురిసి పంట మొత్తం కొట్టుకపోయిన సందర్భాలు ఉన్నాయి. అన్నీబాగుంటే విక్రయించే సమయంలో ధర లేకపోవడం, మార్కెట్‌లో కొనేదిక్కులేకపోవడం వంటి సమస్యలు ఉన్నాయి. దీంతో రైతులకు ఏదోఒకరకంగా నష్టం తప్పడం లేదు. పాలకులు మారుతున్నా.. రైతుల తలరాతలు మాత్రం మారడం లేదు.

కల్లాలు లేక.. కష్టాలు

- రహదారులపైనే ధాన్యం ఆరబోత
- ప్రతీ సీజన్‌లో రైతులకు తప్పని ఇక్కట్లు


మధిర రహదారిపై ఆరబోసిన ధాన్యం

కల్లూరు, నవంబరు1 (ఆంధ్రజ్యోతి) కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాల్లో ధాన్యం అరబోసేందుకు రైతులు నానా కష్టాలు పడుతున్నారు. పంట పోలాల్లో కల్లాలకు స్థలాలు లేక ఈ ప్రాంతానికి చెందిన రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. మండలంలో వరి సాగు 33, వేలకు పైగా సాగు చేశారు. కల్లాలకు పంట పోలాల మధ్యలో ఖాళీ స్థలాలు ఉండని పరిస్థితి. దీంతో రైతులు యంత్రాలతో కోయించిన ధాన్యంను ట్రాక్టర్ ట్రక్కుల్లో లోడింగ్ చేసి వాటిని ప్రధానరహదారులపైన అరబోస్తున్నారు. ఇలా మండలంలోని చిన్నకోరుకొండి, మర్లపాడు, తాళ్లూరు వెంకటాపురం, పోచవరం, లింగాల, బత్తులపల్లి, వెన్నవల్లి, పేరువంచ తదిదర గ్రామాల్లో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే పత్తి, మిర్చి రైతులు కూడా కల్లాలు లేక నానా కష్టాలను ఎదుర్కొంటున్నారు. ఈ వానాకాలం సీజన్‌లో దిగుబడి అయిన ధాన్యాన్ని అమ్ముకోవాలంటే తేమ శాతం తగ్గాలి అప్పడే నాణ్యాత ప్రమాణాలు సరిగ్గా ఉంటే ఆయా రైతులు ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు జరుగుతాయి. అందుకై వరి రైతులు దిగుబడి అయిన ధాన్యాన్ని తేమ శాతం తగ్గేలా కనీసం వారం రోజులకు పైగా ధాన్యాన్ని అరబోయాల్సి ఉంటుంది. ఈ పరిస్థితుల్లో ధాన్యం రైతులు కల్లూరు టు మధిర రహదారిపై సుమారు 20 కిమీ పొడవునా ధాన్యంను అరబోసి రాసులుగా పోస్తున్నారు. ఇలా నవంబరు నెల నుంచి జనవరి నెల వరకు మూడు నెలల పాటుగా ప్రధాన రహదారులపై తేమ శాతం తగ్గేలా తమ ధాన్యాన్ని రైతులు అరబోస్తారు. ఈ సమయంలో వాహనాల రాకపోకలతో ప్రమాదాలు జరిగే ఆవకాశం ఉంది. గతంలో ఇజిఎస్ పథకం నిధులతో కల్లాలు నిర్మించారు.

ఈ కార్యక్రమాన్ని అధికారులు విస్మరిచారు. దీంతో కల్లాల నిర్మాణాన్ని ముందుకు తీసుకోవెళ్లలేని పరిస్థితి నెల కొన్నదని తెలిసింది. ఇప్పటికైన ప్రభుత్వం తరుపున రైతుల పంట పోలాల సమీపంలో గల ఖాళీ స్థలాల్లో కల్లాలు నిర్మించేలా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

పంటనష్టం అంచనాలు సిద్ధం చేయండి


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్లు శ్రీజ, శ్రీనివాసరెడ్డి

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పంటనష్టం అంచనాలను సిద్ధం చేసి ఆరోతేదీలోగా నివేధికలను అందించాలని జిల్లా అదనపు కలెక్టర్లు పి శ్రీజ, శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. నిర్ణీత నమూనాలో తుఫాన్ నష్టం అంచనా నివేదిక సమర్పించాలని వారు కోరారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో మొంథా తుఫాన్ నష్టం అంచనాల నివేదికలు తయారీపై సంబంధిత అధికారులతో శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ మొంథా తుఫాన్ కారణంగా ఖమ్మం జిల్లాలో జరిగిన పంట నష్టం వివరాలు నిర్ణీత నమూనాలో నవంబర్ 6 నాటికి అందించాలని, వ్యవసాయ అధికారులు, ఏఈఓ క్షేత్ర స్థాయిలో రైతుల పొలాలను సందర్శించి పక్కాగా నివేదిక తయారు చేయాలని సూచించారు. అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో తుఫాన్ కారణంగా దెబ్బతిన్న రోడ్లు అందుబాటులో ఉన్న నిధులతో తాత్కాలిక మరమ్మతులు చేసేందుకు అవకాశాలను పరిశీలించి నివేదిక సమర్పించాలని అన్నారు.

ఈ సమావేశంలో డీఆర్వో ఏ. పద్మశ్రీ, సీపీవో ఏ. శ్రీనివాస్, నీటిపారుదల, ఆర్ అండ్‌బీ, పీఆర్ ఎస్ఈ లు ఎం. వెంకటేశ్వర్లు, యాకుబ్, వెంకట్‌రెడ్డి, జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్‌కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, జిల్లా పంచాయతీ అధికారిణి ఆశాలత, జిల్లా మార్కెటింగ్ అధికారి అలీమ్, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ సరిత, ఎన్పీడీసీఎల్ డీఈ రామారావు తదితరులు పాల్గొన్నారు.

రవాణా భత్యాల కోసం దరఖాస్తు చేసుకోండి

కొత్తగూడెం ఎడ్యుకేషన్, నవంబరు1 (ఆంధ్ర జ్యోతి): సుదూర ప్రాంతాల నుంచి ప్రభుత్వ పాఠశాలకు వచ్చే విద్యార్థులకు రాష్ట్ర విద్యాశాఖ రవాణా భత్యాలను మంజూరు చేస్తుందని, అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకునే విధంగా ప్రధానోపాధ్యాయులు ప్రోత్సహించాలని భద్రాద్రి జిల్లా విద్యాశాఖ అధికారి బి.నాగలక్ష్మి తెలిపారు. శనివారం మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో ఆమె మాట్లాడుతూ గత ఏడాదిలో జిల్లాలో 1,136 మంది విద్యార్థులకు రవాణా భత్యాలు అందజేయడం జరిగిందని, ఈ ఏడాది కూడా అధిక సంఖ్యలో విద్యార్థులు దరఖాస్తు చేసుకునే విధంగా చూడాలని కోరారు. ఈ ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్ కింద ఒక్కొక్క విద్యార్థికి నెలకు రూ.600 వంతున 10నెలలకు గాను రూ.6000 మంజూరు అవుతాయని తెలిపారు. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు చదివే విద్యార్థులు తమ ఇంటి నుంచి పాఠశాల ఒక కిలోమీటర్ దూరంలో ఉన్నవారు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు అని తెలిపారు. 9 నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులు తమ ఇంటి నుంచి 5 కిలోమీటర్ల దూరంలో పాఠశాలలకు వచ్చే విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి వీలుంటుంది. ప్రతీ పాఠశాలలో దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల వివరాలు ఈ నెల 5వ తేదీలోగా డీఈఓ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. అర్హులైన విద్యార్థులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునే విధంగా మండల విద్యాశాఖ అధికారులు కృషి చేయాలని కోరారు.

శాంతించిన పాలేరు

కూసుమంచి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు పాలేరు జలాశయం శాంతించింది. వరద తగ్గుముఖం పట్టింది. మొంథా తుపాను కారణంగా పరీవాహక ప్రాంతాలనుంచి పెద్దఎత్తున వరద రావడంతో ఉగ్రరూపం దాల్చిన పాలేరు శాంతించి దాదాపు యథాస్థితికి చే రుకుంటుంది. శనివారం సాయంత్రం 6గంటలకు సుమారు 15,530 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతుండగా, జలాశయం నీటిమట్టం 23.25 అడుగులకు నమోదయింది. ఆదివారం సాయంత్రానికి పూర్తిస్థాయిలో వరద తగ్గే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

సమష్టిగా శ్రమించి.. ఉన్నతంగా తీర్చిదిద్దుతాం

- సత్తుపల్లి ఏరియా జీఎం చింతల శ్రీనివాస్
- బాధ్యతల స్వీకరణ

సత్తుపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నూతనంగా ఏర్పడిన సత్తుపల్లి ఏరియాను అధికారులు, కార్మికుల సమష్టి కృషితో శ్రమించి ఉన్నతంగా తీర్చిదిద్దుతామని సత్తుపల్లి ఏరియా జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్ అన్నారు. శనివారం ఆయన సత్తుపల్లి ఏరియా జీఎంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జేవీఆర్, కిష్టారం ఓసీ మైన్లను సందర్శించిన ఆయన అనంతరం అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. యూనియన్ నాయకుల అభ్యర్థనలు స్వీకరించి కార్మికుల ప్రయోజనాలను నెరవేరుస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కిష్టారం ఓసీ పీవో ఎంపీ నరసింహారావు, అధికారులు బి.రాజేశ్వర్‌రావు, శ్రీనివాస్, కల్యాణ్‌రామ్, సోమశేఖర్, రామకృష్ణ, దేవదాసు, శ్రీనివాస్, కార్మిక సంఘ నాయకులు సుధాకర్, రజాక్, క్రాంతి, నరసింహారావు, సిబ్బంది పాల్గొన్నారు.


సత్యనారాయణస్వామి వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

భద్రాద్రిలో భక్తిప్రపత్తులతో సామూహిక సత్యనారాయణ వ్రతాలు

- చిత్రకూట మండపంలో ఘనంగా కార్యక్రమం
- గతనెలలో రామయ్యను దర్శించిన భక్తులు 1,89,062 మంది
- గతేడాది కన్నా 43,729 మంది అధికంగా రాక

భద్రాచలం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కార్తీకశుద్ధ ఏకాదశి సందర్భంగా భద్రాచలం సీతారామచంద్రస్వామి వారి ఆలయ ప్రాంగణంలోని చిత్రకూట మండపంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలను శనివారం భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ఈ వ్రతాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రూ.516 టికెట్ ధరగా నిర్ణయించిన దేవస్థానం వ్రతానికి కావల్సిన సామగ్రిని అందజేసింది. ఇదిలా ఉండగా భద్రాద్రి రామయ్యను ఈ ఏడాది అక్టోబరులో 1,89,062 మంది భక్తులు దర్శించుకోగా.. గతేడాది ఇదే నెలలో 1,45,333 మంది దర్శించుకున్నారు. అంటే గడేడాది కన్నా 43,729 మంది భక్తులు అధికంగా రావడం విశేషం. ఇదిలా ఉండగా శనివారం సందర్భంగా రామాలయంలో సువర్ణ తులసి అర్చన నిర్వహించారు. అలాగే స్వామివారి నిత్యకల్యాణాన్ని కూడా సంప్రదాయబద్ధంగా జరిపారు.

సర్వేకు.. సన్నద్ధం

(5వ పేజీ తరువాయి)

రైతులు ఆవేదన చెందుతున్నారు. అయితే ప్రస్తుతం ఎండలు కాస్తున్నందున పంటలు కోలుకుంటున్నాయని, అవే వర్షాలు, ముసురు ఇంకా ఉండుంటే పంటల నష్టం అధికంగా ఉండేదని చెబుతున్నారు. దీనివల్ల నష్టం శాతం కూడా కొంత తగ్గే అవకాశం ఉంది. ఏదేమైనా ఈ ఏడాది వర్షాలు సకాలంలో పడటం, సాగర్‌జలాలు పుష్కలంగా ఉండటంతో ఎన్నో ఆశలతో సాగు చేసిన పంటలను మొంథా తుఫాన్ ముంచిందని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. ఈ క్రమంలో వ్యవసాయశాఖ క్షేత్రస్థాయిలో నిర్వహించే సర్వే పక్కాగా ఉండాలని, ప్రభుత్వం వెంటనే పరిహారం అందించాలని కోరుతున్నారు.



తల్లాడ మండలం అన్నారుగూడెంలో నేలవాలిన వరిపైరు, మల్లవరంలో తడిచిన పత్తిదూదిపింజలు (ఇన్‌సెట్‌లో)

మిర్చితోటలు పడిపోయాయి
బొబ్బిళ్ల వెంకటేశ్వర్లు, అన్నారుగూడెం, తల్లాడ మండలం



15 ఎకరాల్లో మిర్చిసాగుచేశా. ఇందులో మూడెకరాలు కాగా 12 ఎకరాలు కౌలుకు తీసకున్నా. ఎకరానికి రూ.25వేలుకౌలు చెల్లించా. ఇప్పటి వరకు ఎకరానికి రూ.95వేలు పెట్టుబడి పెట్టా. ఈదురుగాలులు, తుపాన్‌కు పూత, కాయ దశలో ఉన్న మిర్చి మొక్కలు వేర్లతో సహా పడిపోయాడు. పూతకాయ రాలిపోయింది. పడిపోయిన మిర్చి మొక్కలను పైకి లేపేందుకు అదనంగా ఖర్చవుతోంది. అయినప్పటికి దిగుబడి ఆశాజనకంగా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు.

తీవ్ర నష్టం జరిగింది
వెంకన్న, ఈశ్వరమాధారం, కూసుమంచి మండలం



మొంథా తుఫాన్ కారణంగా తీవ్రంగా నష్టం జరిగింది. ఐదెకరాల్లో వేసిన వరి మరోవారంలో కోయించాల్సి ఉంది. ఈలోపు తుఫాన్ రావడంతో పొలం మొత్తం నేలవాలింది. ఎకరానికి రూ.25నుంచి రూ.30వేల వరకు పెట్టుబడి పెట్టా. కనీసం పెట్టుబడికూడా వచ్చే పరిస్థితి లేదు. ఏటా ఇలానే అకాల వర్షాల కారణంగా నష్టం జరుగుతోంది. వ్యవసాయం చేయాలంటేనే భయం వేస్తుంది. ప్రభుత్వం ఆదుకోవాలి. లేదంటే మున్ముందు పంటలు పండించలేం.

ఖమ్మం డీడబ్ల్యూవో రాంగోపాల్‌రెడ్డి త్వరలో మాతృశాఖకు బదిలీ?

ఖమ్మం ఖానాపురం హవేలి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మహిళా శిశు సంక్షేమశాఖ ఖమ్మం జిల్లా అధికారి (డీడబ్ల్యూవో) రాంగోపాల్‌రెడ్డి తన మాతృశాఖ అయిన వికలాంగుల సంక్షేమ శాఖకు బదిలీ కానున్నట్లు సమాచారం. గతంలో వికలాంగుల సంక్షేమ శాఖలో విధులు నిర్వహించగా.. ఆ శాఖ మహిళా శిశు సంక్షేమంలో విలీనమైంది. ఆయన వివిధ ప్రాంతాలలో విధులు నిర్వహించి ప్రస్తుతం ఖమ్మం డీడబ్ల్యూవోగా ఉన్నారు. వికలాంగుల సంక్షేమ శాఖ హైదరాబాద్ ప్రధాన కార్యాలయానికి బదిలీ అయిన వెంటనే ఉద్యోగోన్నతి రానున్నదని సమాచారం. కాగా మరో వారం రోజుల్లో ఆయన తన మాతృశాఖకు బదిలీ కానున్నారని, ఈ నేపథ్యంలో ఖమ్మం డీడబ్ల్యూవోగా పలువురు సీడీపీవోలతోపాటు ఇతర జిల్లాల్లో ఉన్న డీడబ్ల్యూవోలు, ఇతర శాఖల అధికారులు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది.

‘పేట’ పామాయిల్ ఫ్యాక్టరీలో.. అత్యధిక ఓ-ఈఆర్ గర్వకారణం

(5వ పేజీ తరువాయి)

అశ్వారావుపేటలో మరో ఫ్యాక్టరీ త్వరలో మంజూరు చేస్తామన్నారు. పామాయిల్ విస్తరణలో ఎంతో కృషి చేస్తున్న ఉద్యోగులు, సిబ్బందికి త్వరలోనే తగిన ఇన్సెంటీవ్‌లు ఇస్తామని ప్రకటించారు. పామాయిల్ రైతులకు మేలైన ఎరువులు, పురుగుల మందుల సరఫరాను త్వరలోనే ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో ప్రారంభిస్తామని చైర్మన్ ప్రకటించారు. ఆయిల్‌ఫెడ్‌లో జరుగుతున్న తప్పులను ఎప్పటికప్పుడు సవరించుకుంటూ.. మేలైన మొక్కలు, ఫ్యాక్టరీల నిర్మాణాలను చేపడుతూ ముందుకు సాగుతామని ప్రకటించారు. కార్యక్రమంలో ఆయిల్‌ఫెడ్ జీఎం సుధాకరెడ్డి, ఓఅండ్‌ఆర్ ప్రొడక్ట్ మేనేజర్ శ్రీకాంత్, అశ్వారావుపేట, దమ్మపేట మేనేజర్లు శ్రీకాంత్, నాగబాబు, అశ్వారావుపేట డివిజన్ అధికారి రాధాకృష్ణ, రైతు సంఘ అధ్యక్షుడు ఆలపాటి రామచంద్ర ప్రసాద్, బండి భాస్కర్, కోటగిరి సీతారామస్వామి, శీమకుర్తి వెంకటేశ్వరరావు, మద్దినేని వెంకట్, ఉమామహేశ్వరరావు, కాసాని నాగప్రసాద్, పైడి వెంకటేశ్వరరావు, ఎర్ర వసంతరావు, సత్యనారాయణ, అచుతరావు తదితరులు పాల్గొన్నారు.

పెళ్లి కుదిరిస్తే... కమీషన్ ఎగ్గొట్టారు!

- కల్యాణ మండపం ఎదుట మధ్యవర్తుల ఆందోళన

కామేపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పెళ్లి కుదిరిస్తే.. తమకిస్తామన్న కమీషన్ ఎగ్గొట్టారంటు కళ్యాణ మండపం ఎదుట మధ్యవర్తులు ఆందోళన చేసిన సంఘటన కామేపల్లి మండలం కొత్తలింగాలలో శనివారం జరిగింది. కారేపల్లి మండలం బజ్యాతండకు చెందిన అజ్మీరా నాగేశ్వరరావు పెళ్లి సంబంధాలు కుదిర్చడంలో మధ్యవర్తిగా వ్యవహరిస్తుంటాడు. ఈ క్రమంలో కారేపల్లి మండలం బస్వాపురం అబ్బాయికి, గోవింద్రాలకు చెందిన ఓ అమ్మాయితో వివాహం కుదిర్చాడు. అందుకుగాను అబ్బాయి తరపున రూ.లక్ష, అమ్మాయి తరుపున రూ.35వేలు ఇస్తామని ఒప్పందం చేసుకున్నారు. చివరకు పెళ్లి చేసే సమయంలోనూ ఆ కమీషన్ ఇవ్వకుండా, దురుసుగా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ నాగేశ్వరరావు పెళ్లి జరుగుతున్న కల్యాణమండపం వద్ద తమన యునియన్ వారితో కలిసి ఆందోళన కు దిగాడు. పోలీసులు అక్కడికి చేరుకొని సర్ది చెప్పినట్లు సమాచారం. ఈ క్రమంలో అమ్మాయి తరుపు వారు సాయంత్రానికి రూ.20వేలు ఇచ్చినట్లు తెలిసింది.

ఇంకుడుగుంతలో పడి.. మతిస్థిమితం లేని విద్యార్థి మృతి

కామేపల్లి, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితంలేని ఓ విద్యార్థి ఆడుకుంటూ పాఠశాల ఆవరణలోని ఇంకుడుగుంతలో పడి మృతి చెందిన సంఘటన కామేపల్లి మండలం మద్దులపల్లి గ్రామంలో శుక్రవారంజరిగింది. మద్దులపల్లి గ్రామానికి చెందిన గుండా ప్రణీత్‌రెడ్డి(13)అదే గ్రామంలోని జడ్పీఎస్ఎస్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. పాఠశాల అయిపోయాక తిరిగి ఇంటికి వచ్చి మళ్లీ సాయంత్రం ఆరుగంటల సమయంలో ఆడుకునేందుకు బయటకి వెళ్లాడు. రాత్రవుతున్నా తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు వెతగ్గా.. పాఠశాల ఆవరణంలోని ఇంకుడుగుంతలో మృతిచెంది కనిపించాడు. తండ్రి గుండా సంజీవరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

సామినేని హత్య .. సుపారీ గ్యాంగ్ పనేనా?

(5వ పేజీ తరువాయి)

వెంటనే పట్టుకోవాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పోలీసు ఉన్నతాధికారులకు ఆదేశాలు ఇచ్చిన విషయం తెలిసిందే. దీంతో మరింత సవాల్‌గా తీసుకున్న పోలీసులు పలు కోణాల్లో దర్యాప్తు ముమ్మరం చేశారు. సామినేని రామారావు హత్య ఓ పథకం ప్రకారం జరగడంతో పాటు హత్యకు పదునైన ఆయుధాలు వాడటం, మృతుడు క్షణాల్లో చనిపోయేలా ఛాతి, పొట్ట భాగాల్లో లోతుగా పొడవడం లాంటి విషయాలను పరిశీలిస్తే ఇదంతా ప్రొఫెషనల్ గ్యాంగ్ పనేనని, అది కూడా సుపారీ తీసుకుని చేసి ఉంటారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇక ఆధారాల సేకరణలో నిమగ్నమైన పోలీసులు గ్రామంతో పాటు పక్క గ్రామాల్లో ఉన్న సీసీ పుటేజీలను జల్లెడ పడుతున్నారు. ఈ క్రమంలో వారికి కీలక ఆధారాలు లభ్యమయ్యాయని, హత్యకు రెండు, మూడు రోజుల ముందు కొందరు అపరిచిత వ్యక్తులు గ్రామంలో సంచరించినట్టు గుర్తించారని సమాచారం. ఆ ఆనవాళ్ల ప్రకారం ఆ అపరిచిత వ్యక్తులను గుర్తించే పనిలో ఉన్నారని, ఓ అపరిచిత యువకుడు గంటల కొద్ది గ్రామంలో కూర్చుని రెక్కీ నిర్వహించాడని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. హత్యకు గురైన సామినేని రామారావు సీపీఎం సీనియర్ నాయకుడు కావడం, ఈ కేసు విషయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కూడా చొరవ తీసుకోవడంతో మిస్టరీని ఛేదించేందుకు పోలీసులు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. ఇక రామారావు హత్య నేపథ్యంలో గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు పహారా ఏర్పాటు చేశారు.

నేడు సాట్ ‘క్యూ’ ఎస్సార్ అకడమిక్ టాలెంట్ క్వెస్ట్


టాలెంట్ క్వెస్ట్ కరపత్రాన్ని విడుదల చేస్తున్న ఎస్సార్ విద్యాసంస్థల చైర్మన్ వరదారెడ్డి

హసన్‌పర్తి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహం, ఉన్నత విద్య అవకాశాలను విస్తరించడమే లక్ష్యంగా ఎస్సార్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రతి సంవత్సరం నిర్వహించే ప్రత్యేక ప్రతిభా పరీక్ష సాట్ క్యూ ఎస్సార్ అకడమిక్ టాలెంట్ క్వెస్ట్ ఈ నెల 2వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఎస్సార్ విద్యాసంస్థల చైర్మన్ ఎనగందుల వరదారెడ్డి తెలిపారు. హనుమకొండ టీచర్స్ కాలనీలోని ఎస్సార్ ఎడ్యు సెంటర్‌లో శనివారం సాట్ క్యూ టాలెంట్ క్వెస్ట్ కరపత్రాన్ని ఆయన విడుదల చేసి మాట్లాడారు. ఇంటర్మీడియట్‌లో చేరబోయే 10వ తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హనుమకొండ టీచర్స్ కాలనీ ఎస్సార్ ఎడ్యు సెంటర్ కేంద్రంలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు నిర్వహించే ప్రవేశ పరీక్షను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 10వ తరగతి స్థాయిలో మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సిలబస్‌లో మొత్తం 75 ప్రశ్నలు (ప్రతి సబ్జెక్టుకు 25 చొప్పున) ఉంటాయని తెలిపారు. ఈ ప్రవేశ పరీక్షలో ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహక స్కాలర్‌షిప్‌లు, 100 శాతం స్కాలర్‌షిప్‌లు పొందే అవకాశంతో పాటు ఐఐటీ, జేఈఈ, నీట్ కోచింగ్ ప్రవేశం పొందే ఎంపీసీ స్ట్రీమ్, జేఈఈ మెయిన్, అడ్వాన్స్‌డ్ (ఫోకస్ ప్రైమ్/ఫోకస్ ప్లస్/ఫోకస్/స్పార్క్/టైటన్) బైపీసీ స్ట్రీమ్ నీట్, ఎంసెట్ (ఫోకస్ ప్రైమ్/టైటన్) కోర్సులకు అర్హులని తెలిపారు. ఎస్సార్ ఎడ్యుకేషనల్ అకాడమీ తన 50 ఏళ్ల విద్యా ప్రావీణ్య సంప్రదాయాన్ని కొనసాగిస్తుందన్నారు. దేశంలోనే ఉత్తమ స్థాయిలో నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా సాట్ క్యూ పరీక్షను నిర్వహిస్తుందన్నారు. ఈ పరీక్ష ద్వారా విద్యార్థులు తమ ప్రతిభను నిరూపించుకొని ఉత్తమ స్కాలర్‌షిప్ అవకాశాలను పొందాలన్నారు. విద్యార్థులు పరీక్ష నమోదుకు సమీపంలోని ఎస్సార్ బ్రాంచ్‌ను లేదా 9642117378, 9154989356, 8886287456, 9154854700, 9642117330, 9642117830, 9642114698నెంబర్లలో సంప్రదించాలన్నారు.

కూర గాయాలే!



- రోజురోజుకూ పెరుగుతున్న కూరగాయల ధరలు
- ఏ రకమైనా కిలో రూ. 50 పైమాటే
- ఆకుకూరల ధరలూ పైపైకే
- హడలెత్తుతున్న కొనుగోలుదారులు

ఖమ్మం మార్కెట్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి)

వర్షాకాలం మొదలై పుష్కలంగా వానలు కురుస్తున్నా.. మార్కెట్‌లో కూరగాయల ధరలు మాత్రం మండిపోతున్నాయి. ఏ కూరగాయ కొందామన్నా కిలో రూ. 50కి పైనే ధర పలుకుతోంది. పేదలే కాదు.. మధ్య తరగతి వర్గాలు కూడా కూరగాయలు కొనే పరిస్థితులు కనబడడం లేదు. ఈ ఏడాది వర్షాలు సరిపోయేంత కురిశాయి.. ఇక కూరగాయలు చౌకగా దొరుకుతాయని అనుకున్న కొనుగోదారుల ఆశలు అడియాశలయ్యాయి. గత వారం ఉన్న ధరలతో పోలిస్తే ప్రస్తుతం డబుల్ అయ్యాయని సామాన్యులు వాపోతున్నారు. ఖమ్మం నగరం లోని రైతుబజార్లు, బహిరంగ మార్కెట్‌లలో కూరగాయల ధరలు మండిపోతున్నాయి. ప్రస్తుతం కార్తీకమాసం ప్రారంభం కావడంతో పెళ్లిళ్ల, ఫంక్షన్లు ఎక్కువగా ఉంటాయి. ఆయా కార్యక్రమాలకు కూరగాయల వాడకం అనివార్యం. ప్రస్తుతం వర్షాలు సాధారణం కంటే అధికంగా కురవడంతో కూరగాయల పంటలు దెబ్బతిని ధరలు కొండెక్కాయని వ్యాపారులు పేర్కొంటున్నారు. లోకల్ రైతుల దగ్గర పంట లేకపోవడంతో.. కూరగాయాలను దూర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. ఫలితంగా ధరలు మండిపోతున్నాయి.

వ్యాపారుల నిలువు దోపిడీ

కూరగాయల వ్యాపారులు ధరలు పెంచి కొనుగోలు దారులను నిలువు దోపిడీ చేస్తున్నారు. ప్రభుత్వ రైతుబజార్లలో బోర్డు ధరల కంటే ఎక్కువ ధరకు అమ్మకాలు కొనసాగిస్తున్నారు. బహిరంగ వీధి మార్కెట్లలో, గల్లీ కొట్లలో వారు చెప్పిందే రేటుగా విపరీతంగా ధరలు పెంచి విక్రయిస్తున్నారు. దీంతో సామాన్యుడి వంటగదిలో కూరలు ఉడకకుండానే కుతకుతమంటున్నాయి. టమోటాలు ఎప్పుడూ కిలో రూ. 15 నుంచి 20కు మార్కెట్‌లలో లభ్యమయ్యేవి. అలాంటి టమోటా ఇప్పుడు కిలో రూ. 32 నుంచి రూ.40లకు చేరగా.. సాధారణ రోజుల్లో కిలో రూ. 20కు దొరికే వంకాయ, బెండకాయ.. ఇప్పుడు



కిలో ఏకంగా రూ. 60 నుంచి రూ. 70లకు చేరింది. దీంతో కొనుగోలుదారుడిపై రెండు, మూడు రెట్ల అధిక ధరల భారం పడింది. మార్కెట్‌లో టమోటానే కాకుండా ప్రతీ కూరగాయ ధర ఆకాశాన్నంటింది. సాధారణ రోజుల్లో కిలో రూ. 20లోపు లభించే ప్రతీ కూరగాయ.. ప్రస్తుతం కిలో రూ. 50 నుంచి 60కు, గతంలో రూ. 10కి 3 ఆకుకూరల కట్టలు లభించేవి. కానీ ఇప్పుడు రూ. 20కు 4 ఆకుకూరల కట్టలే లభిస్తున్నాయి. ఫలితంగా సామాన్యుడు కూరగాయలు కొనాలంటేనే బెంబేలెత్తుతున్నాడు. రోజురోజుకూ కూరగాయల ధరలు పెరుగుతూ పేద, మధ్యతరగతి జనానికి చుక్కలు చూపిస్తున్నాయి. డిమాండ్‌కు సరిపడా లోకల్ కూరగాయల నిల్వలు లేక ధరలు పెరుగుతున్నాయని వ్యాపారులు పేర్కొంటున్నారు. ఇతర రాష్ట్రాలనుంచే కాకుండా రాష్ట్రంలోని సుదూర ప్రాంతాల నుంచి కూరగాయలు దిగుమతి చేసుకోవడంతో రవాణా చార్జీల భారం సైతం ధరల పెరుగుదలకు కారణమని వ్యాపారులు చెబుతున్నారు.

పెరిగిన ధరలతో బెంబేలెత్తిపోతున్నాం



వెంకట్‌రెడ్డి, కొనుగోలుదారుడు

పెరిగిన కూరగాయల ధరలతో బెంబేలెత్తిపోతున్నాం. గతంలో కిలో వరకు కొనే కూరలను ప్రస్తుతం అరకిలోతో సర్దుకుంటున్నాం. ఇప్పుడు కూరగాయలు తక్కువ ధరకు లభించాల్సిన సమయం. ఇందుకు విరుద్ధంగా కూరగాయల ధరలు ఆకాశాన్నంటాయి. అధికారులు కూరగాయల ధరలపై నియంత్రణ ఉంచాలి.

రైతుబజార్, బహిరంగ మార్కెట్‌లో కూరగాయల ధరలు ఇలా..

కూరగాయలు (కిలో ఒక్కింటికి)	ధర (రూపాయల్లో)
టమాటా	32-40
వంకాయ	56-60
బెండకాయ	66-70
పచ్చిమిర్చీ	40-50
కాకరకాయ	46-50
బీరకాయ	68-70
క్యాబేజీ	30-40
దొండ	50-60
సొరకాయ	46-50
క్యారెట్	80-100
ఆలుగడ్డ	30-35
ఉల్లిగడ్డ	30-35
కోడిగుడ్ల ట్రే	170- 180
కొత్తిమీర కట్ట	30-40



మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి పాటిల్ వసంత్

ఫోరెన్సిక్ సైన్స్‌పై న్యాయవాదులకు అవగాహన తప్పనిసరి : పాటిల్

కొత్తగూడెం లీగల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కోర్టు కేసుల్లో ఫోరెన్సిక్ సాక్ష్యం అనేది కీలకపాత్ర పోషిస్తుందని.. న్యాయవాదులు దీనిపై అవగాహన కలిగి ఉండాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా న్యాయాధికారి పాటిల్ వసంత్ సూచించారు. శనివారం జిల్లా న్యాయవాదుల లైబ్రరీ హాల్‌లో ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఐఎల్‌పీఏ) ఆధ్వర్యంలో 'కోర్టు కేసులలో ఫోరెన్సిక్ సాక్ష్యం.. ప్రాముఖ్యత' అన్న అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పాటిల్ వసంత్ మాట్లాడుతూ.. ఫోరెన్సిక్ సైన్స్‌పై న్యాయవాదులు అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం ప్రొ- బ్లాక్ డైరెక్టర్ మోహన్ ఎర్రగొళ్ల మాట్లాడుతూ.. భారత సాక్ష్యం చట్టంలో ఫోరెన్సిక్ సైన్స్‌కు ఉన్న ప్రాధాన్యతను వివరిస్తూ.. నేటి రోజుల్లో ఫోరెన్సిక్ పరిశోధనల అవసరం మరింత పెరిగిందన్నారు. న్యాయవాదులు ఈ రంగంలో నేర్చుకోవాల్సిన నైపుణ్యాలను ప్రస్తావించారు. పాలిగ్రఫీ టెస్ట్, ఫింగర్ ప్రింట్ అనాలసిస్, నార్కో అనా లసిస్, హ్యాండ్ రైటింగ్ అనాలసిస్, సంతకం ధ్రువీకరణ వంటి అంశాలపై పూర్తి సవివరమైన అవగాహన కల్పించారు. ఈ సదస్సుకు విశిష్ఠ అతిథులుగా అదనపు జిల్లా న్యాయాధికారి ఎస్. సరిత, న్యాయాధికారులు ఎం. రాజేందర్. కె. కిరణ్ కుమార్, కె.కవిత. కె.సాయిశ్రీ, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రాజమల్లు తదితరులు హాజరయ్యారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు లక్కినేని సత్యనారాయణ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఐఎల్‌పీఏ జిల్లా కన్వీనర్లు జె.గోపికృష్ణ సుంకర భానుప్రియ, సీనియర్ న్యాయవాదులు పోసాని రాధాకృష్ణమూర్తి, జె.శివరామ్‌ప్రసాద్, విజయ్‌భాస్కర్‌రెడ్డి, పి.నాగేశ్వరరావు, గంట వీరభద్రం, కిలారు పురుషోత్తం, బి.చిరంజీవి, నల్లమల్ల ప్రతిభ పాల్గొన్నారు.

రామాలయంలో కార్తీక దీపాల తొలగింపు వివాదాస్పదం

- పారిశుధ్య మహిళా సిబ్బందితో భక్తుల వాగ్వాదం

భద్రాచలం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయ ప్రాంగణంలో శనివారం తెల్లవారుజామున భక్తులు దీపాలను వెలిగించి ఉంచగా.. సమీపంలో ఉన్న పారిశుధ్య మహిళ సిబ్బంది వాటిని తొలగించడం వివాదాస్పదమైంది. కార్తీక శుద్ధ ఏకాదశి సందర్భంగా మహిళా భక్తులు దీపాలను వెలిగించి రామకోటి స్థూపాల సమీపంలోని పోకల దమ్మక్క విగ్రహం ఎదుట ఉంచారు. అయితే అక్కడ దీపాలు వెలగించవద్దని పేర్కొంటూ పారిశుధ్య మహిళ సిబ్బంది ఒకరు దీపాలను పక్కకు తీశారు. దీంతో ఆమెకు, భక్తులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో ఆమె సైతం భక్తులతో దురుసుగా మాట్లాడటంతో ఈ ఘటన వివాదాస్పదమైంది. దీంతో అక్కడ ఉన్న భక్తులు వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పెట్టడంతో విస్తృతంగా ప్రచారం సాగుతోంది. అయితే ఇందులో సదరు పారిశుధ్య మహిళ సిబ్బంది ఓ అన్యమతానికి చెందిన మహిళగా వారు పేర్కొంటుండగా.. వాస్తవానికి ఆమె హిందూ మతానికి చెందిన వారేనని దేవస్థానం వర్గాలు పేర్కొంటున్నాయి. గత ఏడాది కాలం నుంచి దీపాలు వెలిగించే ప్రదేశాన్ని రామకోటి స్థూపాల ప్రాంతం నుంచి చిత్రకూట మండపం కిందకు అధికారులు మార్చారు. కార్తీకమాసం క్రమంలో అధిక సంఖ్యలో భక్తులు వస్తుండడంతో.. దీపాలను వెలిగిస్తున్న క్రమంలో ఈ ఘటన చోటు చేసుకోవడం గమనార్హం.

15న సూపర్ లోక్ అదాలత్

ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయాధికారి రాజగోపాల్

ఖమ్మం లీగల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అపరేష్ కుమార్ సింగ్ ఆదేశాల ప్రకారం ఈనెల 15న ఖమ్మంలో సూపర్ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్టు జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.రాజగోపాల్ తెలిపారు. శనివారం ఖమ్మంలో న్యాయాధికారులతో ఆయన సమావేశం నిర్వహించి లోక్ అదాలత్ విజయవంతం చేసేందుకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం రాజగోపా ల్ మాట్లాడుతూ.. ఈ ప్రత్యేక లోక్ అదాలత్ ద్వారా సోమవారం నుంచి ఈనెల 15 వరకు చెక్‌బౌన్స్ కేసులు, రోడ్డు ప్రమాద బీమా కేసులు, రాజీపడదగిన సివిల్, క్రిమినల్ కేసులను పరిష్కరించుకోవచ్చునన్నారు. మొత్తం చెక్‌బౌన్స్ కేసులు 5536 కేసులు, క్రిమినల్ కాంపౌండ్ కేసులు 3651ని గుర్తించి నోటీసుల ద్వారా కక్షిదారులకు సమాచారం తెలియజే స్తామన్నారు. కేసులను పరిష్కరించేందుకు ఖమ్మంతోపాటు మధిర, సత్తుపల్లి, జిల్లా వ్యాప్తంగా 15 బెంచీలు ఏర్పాటు చేశామని, ఏ కోర్టు పరిధిలోని కేసులను అదే కోర్టు న్యాయాధికారి పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో మధ్యవర్తిత్వం, ఏడీఆర్(ప్రత్యామ్నాయ పరిష్కార పద్ధతి) ద్వారా అధిక సంఖ్యలో కేసులను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రత్యేక లోక్ అదాలత్ విజయవంతం చేసేందుకు జిల్లావ్యాప్తంగా బ్యానర్ల ద్వారా ప్రచారం నిర్వహిస్తామన్నారు. న్యాయ వాదులతోపాటు కక్షిదారులు, బీమా కంపెనీల



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి రాజగోపాల్

ప్రతినిధులు, బ్యాంకు అధికారులు, పోలీసు అధికారులతో స్థానిక న్యాయ సేవాధికారిసంస్థ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయాధికారులు కె.ఉమాదేవి, వెంపటి అపర్ణ, ఎం.అర్చనాకుమారి, దేవినేని రాంప్రసాదరావు, ఎం.కల్పన, వి.శివ రంజని, టి.మురళీమోహన్, కాసరగడ్డ దీప, బెక్కం రజని, ఏపూరి బిందుప్రియ, వినుకొండ మాధవి, బి.నాగలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

రూ.30 లక్షల

గంజాయి ఆయిల్ స్వాధీనం

- ఇద్దరు నిందితుల రిమాండ్



నిందితులతో సీఐ

రఘునాథపాలెం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): అక్రమంగా రవాణా జరుగుతున్న గంజాయి ఆయిల్‌ను రఘునాథపాలెం పోలీసులు స్వాధీనం చేసుకొని నిందితులను రిమాండ్‌కు పంపారు. శనివారం సీఐ ఉస్మాన్ షరీఫ్ ఆధ్వర్యంలో యాపిల్ సెంటర్‌లో వాహన తనిఖీలు చేస్తుండగా.. ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా వాహనంలో ప్రయాణిస్తుండడాన్ని గుర్తించారు. వెంటనే వారిని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టగా.. అక్రమ గంజాయి వివరాలు బయటపడ్డాయి. సీఐ ఉస్మాన్‌షరీఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజమండ్రికి చెందిన జానకీ రామయ్య గంజాయి వ్యాపారం చేస్తున్నాడు. వైఎస్ఆర్ కాలనీకి చెందిన కొత్తా రాముకు గత కొంతకాలంగా గుట్టుచప్పుడుగా గంజాయి అమ్ముతున్నాడు. ఖమ్మం నగరంలోని యువతకు గంజాయితో పాటు గంజాయి ఆయిల్‌ను సరఫరా చేస్తున్నాడు. ఇటీవల కాలంలో ఖమ్మం నగరంతో పాటు రఘునాథపాలెం పోలీసుస్టేషన్‌ల పరిధిలో గంజాయి మత్తుతో నేరాలు జరుగుతున్న యువకుల సంఖ్య పెరిగింది. ఈ విషయమై అనేక ఫిర్యాదులు రావటంతో రఘునాథపాలెం సీఐ ఉస్మాన్ షరీఫ్ ఆధ్వర్యంలో గత వారం రోజులుగా ప్రత్యేక నిఘా పెట్టారు. ఈ క్రమంలో శనివారం కారులో అక్రమంగా గంజాయి ఆయిల్‌ను తరలిస్తున్న ఇద్దరిని పట్టుకొని రిమాండ్‌కు పంపినట్లు సీఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు.

మద్యం మత్తులో అల్లుడి ఘాతుకం

- భార్యతో పాటు అత్త, చిన్నత్తపై బ్లేడుతో దాడి
- వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాధితులు
- భద్రాచలంలో ఘటన

భద్రాచలం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో ఖాసీం అనే వ్యక్తి మద్యం మత్తులో అతని భార్య జాస్మిన్, అత్త హమీదా, చిన్నత్త ఫాతిమాలపై దాడిచేసి గాయపరచగా వారు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ సంఘటన భద్రాద్రికొత్తగూడెం జిల్లా భద్రాచలంలో శనివారం జరిగింది. బాధితులు తెలిపిన వివరాలివీ.. భద్రాచలంలోని సుందరయ్యనగర్‌కు చెందిన ఖాసీం మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం మద్యం మత్తులో ఇంటికి వచ్చిన ఖాసీం భార్య జాస్మిన్‌తో గొడవపడి ఆమెపై బ్లేడుతో దాడి చేశాడు. ఈ క్రమంలో అత్త హమీద, చిన్నత్త ఫాతిమా అడ్డుపడగా.. వారి మధ్య పెనుగులాట జరిగింది. ఈ క్రమంలో ఖాసీం తన వద్ద ఉన్న బ్లేడుతో వారిద్దరిపై కూడా కూడా దాడి చేయడంతో గాయాలపాలైన మహిళలు కేకలు వేయడంతో స్థానికులు ముగ్గురిని భద్రాచలం ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రస్తుతం వారు చికిత్స పొందుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని తొలుత ఖాసీంను స్టేషన్‌కు తరలించగా.. అతడికి కూడా గాయాలవడంతో వైద్యశాలకు తరలించారు. ఎస్సై సతీష్ సంఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించడంతో పాటు వైద్యశాలలో ఉన్న బాధితులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. వారిచ్చిన వివరాల మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

పొలానికి వెళ్లి.. వాగులో శవమై తేలాడు

తల్లాడ, నవంబరు1(ఆంధ్రజ్యోతి): మూడు రోజుల క్రితం ఇంటినుంచి పొలానికి వెళ్లిన వ్యక్తి వాగులో శవమై తేలిన సంఘటన శనివారం తల్లాడ ండలం కుర్నవల్లి గ్రామంలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. కుర్నవల్లి తూర్పు ఎస్సీ కాలనీకి చెందిన తాటిపర్తి ఏసు(50) రాళ్లవాగు సమీపంలో కౌలు తీసుకుని సాగుచేస్తున్న వరిపొలం వద్దకు గత గురువారం వెళ్లాడు. పొలం సమీపంలోని రాళ్లవాగులో దిగి వరద ఉధృతికి కొట్టుకుపోయాడు. ఏసుభార్య వైరా మండలం పాలడుగు గ్రామంలో పుట్టింటివద్ద ఉంది. పొలానికి వెళ్లిన ఏసు తిరిగి రాకపోవడంతో భార్యవద్దకు వెళ్లి ఉంటాడని భావించారు. అయితే శనివారం మధ్యాహ్నం రాళ్లవాగు సమీపంలోని పొలాల వద్దకు స్థానిక రైతులు వెళ్లగా.. వాగులో ఏసు మృతదేహం ఉబ్బిపోయి ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. చీకటి పడడం, వాగులో వరద ఎక్కువగా ఉండడంతో వాగులో నుంచి మృతదేహాన్ని వెలికి తీసేందుకు పరిస్థితి అనుకూలించకపోవడంతో పోలీసులు వెనుదిరిగారు.



నిమ్మవాగులో గాలిస్తున్న మత్స్యకారులు

వ్యాన్ డ్రైవర్ ఆచూకీ కోసం కొనసాగుతున్న గాలింపు

కొణిజర్ల,నవంబరు1(ఆంధ్రజ్యోతి): నిమ్మవాగులో గల్లంతైన డీసీఎం వ్యాన్ డ్రైవర్ మురళీకృష్ణ ఆచూకీ నాలుగో రోజు కూడా లభ్యంకాలేదు. శనివారం మత్స్యకారులతో నిమ్మవాగు నుంచి 12 కిలోమీటర్లు పొడవునా వైరా రిజర్వాయర్ లోతట్టు వరకు గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం వరకు గాలించినా.. ఫలితం లేదు. నీళ్లలోపల ఇసుకలో కూరుకుపోయి ఉంటాడనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. మొంథా తుఫాన్‌కు డీసీఎం వ్యాన్ కొట్టుకుపోగా డ్రైవర్ మురళీకృష్ణ గల్లంతైన సంగతి తెలిసిందే. కాగా.. డ్రైవర్ ఆచూకీ కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నట్టు ఎస్సై సూరజ్ తెలిపారు.

అదుపు తప్పి ఆటో బోల్తా

- అతి వేగమే ప్రమాదానికి కారణం
- ముగ్గురు విద్యార్థినులకు తీవ్ర గాయాలు
- కొత్తగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలింపు



గాయపడిన విద్యార్థినులను 108 వాహనంలో తరలిస్తున్న దృశ్యం



వివరాలను నమోదు చేసుకుంటున్న పోలీసులు

జూలూరుపాడు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): అదుపుతప్పి ఆటో బోల్తా పడడంతో ముగ్గురు విద్యార్థినులకు తీవ్ర గాయాలైన ఘటన శనివారం మండలంలోని వెంగన్నపాలెం గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని కొమ్ముగూడెం, బేతాళపాడు, మాచినేనిపేటతండా, సాయిరాంతండా గ్రామాలకు చెందిన ఆరుగురు విద్యార్థినులు జూలూరుపాడులోని సాధన జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నారు. వారు ఆటోలో కళాశాలకు వస్తున్నారు. ఈక్రమంలో వెంగన్నపాలెంలోని సెయింట్‌ఆంథోని పాఠశాల సమీపంలో ముందు వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి ఆటో అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న బేతాళపాడుకు చెందిన పాలెపు శరణ్య, మాచినేనిపేట తండాకు చెందిన లకావత్ స్నేహలత, సాయిరాంతండాకు చెందిన బానోత్ నిఖితకు తీవ్ర గాయాలు కాగా.. ఆటోలో ఉన్న మరో ముగ్గురికి ఎలాంటి గాయాలు కాలేదు. గాయపడ్డ ముగ్గురు స్టూడెంట్స్‌ను జూలూరుపాడులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించి.. ఆ తర్వాత మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం 108 వాహనంలో కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. జూలూరుపాడు ప్రభుత్వ ఆసుపత్రిని పోలీసులు సందర్శించి వివరాలను నమోదు చేసుకున్నారు. ఆటో డ్రైవర్ అతి వేగంగా నడపడంతోనే ప్రమాదం చోటు చేసుకున్నట్టు ఆటోలో ఉన్న విద్యార్థినులు పోలీసులకు తెలిపారు. ప్రస్తుతం విద్యార్థినుల పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. కాగా.. పోలీసులు ఆటో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలికలు సదనం నుంచి ఇద్దరి పరారీ

- స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన సీడీపీవో
- మధ్యాహ్నం తల్లులతో కలిసి సదనానికి వచ్చిన బాలికలు
- ఊపిరి పీల్చుకున్న అధికారులు

మణుగూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మణుగూరులోని బాలల సదనంలో ఆశ్రయం పొందుతున్న భద్రాచలం ప్రాంతానికి చెందిన ఇద్దరు బాలికలు శనివారం ఉదయం 5.30గంటల సమయంలో సదనం నుంచి పారిపోయారు. వారిలో ఒకరికి బాల్య వివాహం చేసేందుకు తల్లిదండ్రులు ప్రయత్నించగా కొత్తగూడెంకు చెందిన చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ సభ్యులు అడ్డగించి మణుగూరులోని శివలింగాపురం బాలల సదనానికి తరలించారు. అలాగే మరో మైనర్ బాలికను ఓయువకుడు వేధింపులకు గురిచేస్తుండగా అతడిపై పోక్సో కేసు నమోదైంది. ఈ క్రమంలో రక్షణ కోసం బాలికను అధికారులు గత నెలలో సదనంలో చేర్పించారు. ఈ క్రమంలో ఆ ఇద్దరు బాలికలు శనివారం ఉదయం సదనం గోడ దూకి పారిపోగా.. సీడీపీవో విజయలక్ష్మి సదనాన్ని చేరుకుని వివరాలు సేకరించి సూపరింటెండెంట్ శిరీషతో కలిసి స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో వారి కోసం ఇటు పోలీసులు, అటు అధికారులు గాలిస్తుండగా.. వారిద్దరూ తమ ఇళ్లకు చేరారని తెలిసింది. ఈలోపే మధ్యాహ్నానికి ఇద్దరు బాలికలను వారి తల్లులను సదనానికి తీసుకొచ్చారు. దాంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. ఈ ఘటనపై కలెక్టర్ జితేష్ వి పాటిల్ స్పందిస్తూ బాలికలు, వారి తల్లిదండ్రులను ఆదివారం కలెక్టరేట్‌కు తీసుకురావాలని అధికారులను ఆదేశించినట్టు విశ్వసనీయ సమాచారం.

బాలికపై ముగ్గురి లైంగిక దాడి

- నిందితుల్లో ఓ మేజర్, ఇద్దరు మైనర్లు
- తమ్ముడు కిందపడ్డాడని మాయమాటలు చెప్పి అఘాయిత్యం
- ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలంలో ఘటన

కొణిజర్ల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : 'మీ తమ్ముడు కింద పడి పోయాడు. వెంటనే ఇంటి రా' అంటూ మాయమాటలు చెప్పిన ముగ్గురు.. ఓ బాలికపై లైంగిక దాడి చేసిన సంఘటన శుక్రవారం రాత్రి ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలంలో జరిగింది. విషయాన్ని బాలిక తన తల్లిదండ్రులకు చెప్పడంతో శనివారం వారు కొణిజర్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. ఆ ముగ్గురిపై పోక్సో కేసు నమోదు చేశారు. నిందితుల్లో ఇద్దరు మైనర్లు కాగా ఒకరు మేజర్. ప్రస్తుతం వారు పరారీలో ఉన్నట్టు ఎస్సై సూరజ్ తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు, ఎస్సై తెలిపిన వివరాలివీ. కొణిజర్ల మండలంలోని ఓ గ్రామానికి ఎనిమిదో తరగతి చదువుతున్న బాలిక.. తల్లిదండ్రులు పని నిమిత్తం హైదరాబాద్ వెళ్లగా శుక్రవారం సాయంత్రం ఆమె తన నాయనమ్మ, తాతయ్యతో కలిసి ఇంటి సమీపంలోని ప్రార్థనామందిరానికి వెళ్లింది. ఈ క్రమంలో బాలిక టాయిలెట్ కోసమని దగ్గరలోనే ఉన్న తన ఇంటికి వస్తుండగా.. మార్గమధ్యలో ఆమెను కలిసి నిందితుల్లోని ఓ మైనర్.. 'మీ తమ్ముడు కిందపడిపోయాడు. దెబ్బలు తగిలాయి. త్వరగా రా' అంటూ నిందితుల్లో ఒకరైన 18ఏళ్ల యువకుడి ఇంటికి తీసుకెళ్లాడు. అప్పటికే అక్కడ ఉన్న యువకుడు, మరో మైనరు ఉండగా.. ముగ్గురూ ఆ బాలికపై లైంగికదాడి చేశారు. వారి నుంచి తప్పించుకొని రాత్రి తన ఇంటికి చేరుకున్న బాలిక.. శనివారం తెల్లవారుజామున హైదరాబాద్ నుంచి ఇంటికి వచ్చిన తల్లిందద్రులకు విషయాన్ని చెప్పింది. దీంతో వారు శనివారం కొణిజర్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు మేరకు బాలికపై లైంగిక దాడి చేసి యువకుడు, ఇద్దరు మైనర్లపై పోక్సో కేసు నమోదు చేశారు. ప్రస్తుతం నిందితులు పరారీలో ఉన్నారని, త్వరలోనే వారిని పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

కోడిపుంజుల దొంగల పట్టివేత

దుమ్ముగూడెం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి):వ్యాపారం ముసుగులో గ్రామాల్లో తిరుగుతూ పట్టపగలే కోడిపుంజులు, విలువైన దుస్తులను దొంగతనం చేస్తున్న ఒక ముఠాను రామకృష్ణాపురం వాసులు శనివారం పట్టుకున్నారు. కోడిపుంజులను దొంగిలించి వెళ్తున్న ముగ్గురు వ్యక్తులు రామకృష్ణాపురంలోని ఒక ఎరువుల దుకాణంలోని సీసీ కెమెరాకు చిక్కారు. దొంగతనం చేసిన వారి ఫొటోలు, వీడియోలను విలేజ్ గ్రూపులో పోస్టు చేశారు. సీసీ కెమెరాకు చిక్కిన ముగ్గురు వ్యక్తులు సరిహద్దు ఏపీ రాష్ట్రం కన్నాయిగూడెం వద్ద ఉండగా.. రామకృష్ణాపురం వాసి ఒకరు శనివారం గుర్తించారు. నిలదీసి గట్టిగా ప్రశ్నించగా చేసిన దొంగతనం ఒప్పుకోవడంతో పాటు దొంగిలించిన రెండు కోడిపుంజులను తెచ్చి ఇచ్చారు. ఈ ముఠాలో ఇద్దరు మహిళలు, ఒక మగ వ్యక్తి ఉండగా.. నిలదీస్తున్న సమయంలో మగ వ్యక్తి తన ద్విచక్రవాహనాన్ని వదిలేసి పారిపోయాడు. పట్టుబడిన మహిళలను దుమ్ముగూడెం పోలీసులకు అప్పగించారు. కాగా.. బండారుగూడెం, రామకృష్ణాపురం గ్రామాలకు చెందిన పలువురు వ్యక్తులు తమ గ్రామాల్లోనూ ఇటీవల కాలంలో ఇలాంటి దొంగతనాలు చాలా జరిగాయని తెలిపారు. ముఠాలోని ముగ్గురు వ్యక్తులు ఒకే టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై తిరుగుతూ దొంగతనాలు చేస్తున్నట్లు తెలిసింది.

ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య

అశ్వారావుపేట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): అశ్వారావుపేటలోని ఓ కూరగాయల దుకాణంలో పనిచేసే అన్నమనేని శ్రీను(52) అనే వ్యక్తి చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శనివారం అశ్వారావుపేటలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ఏపీలోని జీలుగుమిల్లి మండలం, దర్భగూడెంకు చెందిన అన్నమనేని శ్రీను కొద్దికాలంగా అశ్వారావుపేటలోని ఓ కూరగాయల దుకాణంలో పనిచేస్తున్నాడు. మద్యానికి బానిసైన శ్రీను తరుచూ భార్య వాణితో కలహాలు జరుగుతుండేవి. శనివారం శ్రీను అతిగా మద్యం తాగి పేటమాలపల్లి శివారులోని ఓ మామిడి తోటలో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై యయాతిరాజు తెలిపారు.



నగర వాసి ప్రభాకర్‌కు డాక్టరేట్

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎస్‌బీఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్‌ఈ విభాగం సహాయ ఆచార్యుడు గంటెల ప్రభాకర్‌కు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందారని కళాశాల చైర్మన్ కృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్హాన్స్ మెథాడాలజీస్ ఫర్ డేటా సెక్యూరిటీ ఇన్ క్లౌడ్ ఎన్విరాల్‌మెంట్ యూజింగ్ డీప్ లెర్నింగ్ మోడల్స్ అనే అంశంపై డాక్టర్ బొబ్బా బసవేశ్వరరావు పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ప్రభాకర్‌ను అభినందించారు.

ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలి

ఖమ్మం రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్‌ను నిషేధించాలని ఖమ్మం జూనియర్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్ రామారావు అన్నారు. మండల పరిధిలోని ఎం వెంకటాయపాలెం గ్రామంలో శనివారం కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపులో భాగంగా ప్లాస్టిక్ వాడకం వలన కలిగే నష్టాలను, ఈ భూమికి, ప్రకృతికి, మానవ ఆరోగ్యానికి కలిగే నష్టాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు పంటలకు రసాయన ఎరువులు వాడవద్దన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విజయలక్ష్మీ, చంద్రకళ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ సేవలు అభినందనీయం

» రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి

నేలకొండపల్లి, నవంబరు1(ఆంధ్రజ్యోతి): వాసవీ క్లబ్‌లు ఆర్య వైశ్యులకే గాకుండా సామాన్యులకు చేస్తున్న సేవలు ఎంతో అభినందనీయమని ఖమ్మం రూరల్ ఏసీపీ బి.తిరుపతిరెడ్డి అన్నారు. వాసవీ క్లబ్ గ్రేటర్ నేలకొండపల్లి, అధ్యక్షుడు డాక్టర్ నాగుబండి శ్రీనివాసరావు, 20, 23 నేలకొండపల్లి, శ్రీకన్యకా పరమేశ్వరి, రాజేశ్వరపురం, అధ్యక్షులు కొత్తా శారదాదేవిల సంయుక్త సహకారంతో దాదాపు రూ.2లక్షల వ్యయంతో నిర్మాణం చేసిన నేలకొండపల్లి పోలీస్ స్టేషన్‌లోని సెక్టార్ హాల్‌ను ఏసీపీ శనివారం ప్రారంభించారు. నేలకొండపల్లిలో సీసీ కెమేరాల ఏర్పాటుకు అడగ్గానే ముందుకు వచ్చి ఆర్థిక సహకారం అందిచ్చిన వాసవీ క్లబ్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఎస్ఐ పి.సంతోష్ మాట్లాడుతూ సీసీ కెమేరాలను మానిటరింగ్ చేయటానికి రెండు లెడ్ టీవీలను బహూకరించాల్సిందిగా కోరగా స్పందించిన ఉమ్మడి ఖమ్మం జిల్లా గవర్నర్ కొత్తా వెంకటేశ్వరరావు రెండు లెడ్ టీవీలను తాను బహూకరిస్తానని వాగ్దానం చేశారు. కార్యక్రమంలో సీఐలు టి.సంజీవ్, మురళి, రాజు, ఎస్ఐ పెంటరి సంతోష్, వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రేగూరి హనుమంతరావు, గ్రేటర్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ నాగుబండి శ్రీనివాసరావు, కొత్తా రమేష్, కొత్తా శారదాదేవి, వాసవీభవన్, నేలకొండపల్లి అధ్యక్షుడు మాటూరి సుబ్రమణ్యం, యర్రా నాగేశ్వరరావు, గెల్లా జగన్మోహన్‌రావు, నెల్లూరి భద్రయ్య, వెన్నపూసల సీతారాములు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

ఖమ్మం రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు సీతారాములు డిమాండ్ చేశారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని టీఎన్జీవో ఫంక్షన్ హాల్లో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 7న హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న పెన్షనర్ల ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఆత్మీయ సమ్మేళనంలో సీనియర్ సిటిజనులకు, ఇటీవల పదవి విరమణ పొందిన ఉద్యోగులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పిచ్చిరెడ్డి గంగయ్య, పి.సుదర్శన్, వెంకట నర్సమ్మ, యాస వెంకటేశ్వరరావు, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్య బలోపేతానికి పోరాటాలు

» పీవోడబ్ల్యూ రాష్ట్ర నాయకురాలు ప్రతాపనేని శోభ

ఖమ్మం కార్పొరేషన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతం కోసం పీడీఎస్‌యూ దశాబ్దాలుగా ఉద్యమాలు చేస్తుందని, భవిష్యత్‌లోను మంచి పోరాటాలు నిర్వహించాలని పీవోడబ్ల్యూ రాష్ట్ర నాయకురాలు ప్రతాపనేని శోభ తెలిపారు. శనివారం ఖమ్మం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఖమ్మం డివిజన్ 23వ మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీవోడబ్ల్యూ నాయకురాలు ఝాన్సీతో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నిక చేశారు. డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులుగా సాధిక, యశ్వంత్‌లను నియామకం చేశారు. ఉపాధ్యక్షులుగా సందీప్, హరీష్, నజీర్, సహాయ కార్యదర్శులుగా పృధ్వీ, అశోక్, ప్రణవ్, కోశాధికారిగా మహేష్‌ను ఎన్నుకున్నారు.

రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలకు 'ఇగ్నైట్' విద్యార్థులు

ఖమ్మం స్పోర్ట్స్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఇటీవల నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) జిల్లాస్థాయి స్కేటింగ్ ఎంపికల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు తమ పాఠశాల విద్యార్థులు తొట జిజ్ఞాస, ఆవునూరి కౌశల్ ఎంపికయ్యారని ఇగ్నైట్ పాఠశాల యజమాన్యం తెలిపింది. ఈ సందర్భంగా రాష్ట్ర పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ మాధవరావు, ప్రిన్సిపాల్ అభినందించారు. భవిష్యత్ పోటీలలో రాణించి ఖమ్మం జిల్లాకు ఖ్యాతిని తీసుకురావాలని ఆకాంక్షించారు.

కుటుంబ సభ్యులకు వ్యక్తి అప్పగింత

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): నగరంలోని అన్నం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆశ్రయం పొంది వైద్యసేవలు అనంతరం కోలకున్న మహారాష్ట్ర వాసిని శనివారం కుటుంబ సభ్యులకు అన్నం శ్రీనివాసరావు అప్పగించారు. గత ఆరు సంవత్సరాల క్రితం గుర్తుతెలియని వృద్ధుడు మతిస్థిమితం కోల్పోయి ఖమ్మంలో తిరుగుతుండగా ప్రజల సమాచారం మేరకు పోలీసులు అన్నం ఫౌండేషన్‌కు అప్పగించారు. అతనికి వసతి, వైద్య సేవలు అందించగా ఇటీవల కోలుకోని వివరాలు తెలిపాడు. నాది మహారాష్ట్ర నాగపూర్ జిల్లా కటోలు గ్రామానికి చెందిన రాజేంద్ర సూర్యవంశం అని, భార్య పేరు వందన, కుమారుడు మగేష్ అని తెలిపాడు. పోలీసుల ద్వారా ఆచూకీ కనుగొన్నారు. పేద కుటుంబం కావటంతో మహారాష్ట్ర నుంచి ఖమ్మం రాలేక ఖమ్మం నుంచి అన్నం ఫౌండేషన్ సభ్యులు రైలు ద్వారా నాగపూర్ వెళ్లి అక్కడి నుంచి కటోలు గ్రామానికి తీసుకెళ్లి కటోలు పోలీసుల సమక్షంలో కుటుంబ సభ్యులైన భార్య వందన, కుమారుడు మహేష్‌కు అతడిని అప్పజేప్పారు.

27 సంవత్సరాల తర్వాత పరిహారం

నేలకొండపల్లి, నవంబరు1(ఆంధ్రజ్యోతి): దాదాపు 27 సంవత్సరాల అనంతరం ప్రమాదానికి సంబంధించిన పరిహారం వచ్చిన సంఘటన మండల పరిధిలోని కోరట్లగూడెం గ్రామానికి చేందిన కొత్తపల్లి వెంకటేశ్వర్లు 1998లో రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అనంతరం ప్రమాద బీమా కోసం దరఖాస్తు చేయగా ఇన్సూరెన్సు కంపెనీ వివిధ కారణాలతో తిరస్కరించింది. దీనిపై మృతుని కుటుంబం కోర్టులో దావా వేశారు. ఇటీవల కాలంలో కోరట్లగూడేనికి చెందిన కాంగ్రెస్ నాయకుడు బచ్చలకూరి నాగరాజు న్యాయవాదిని ఏర్పాటు చేసి కేసును నడిపించగా మృతుని కుటుంబానికి రూ.2,81,321లు నష్ట పరిహారంగా ఇవ్వాలని తీర్పు వెలువడినట్లు నాగరాజు చెప్పారు. అందుకు సంబంధించి కమిషనర్ ఫర్ ఎంప్లాయిస్ కాంపెన్‌సేషన్ అండ్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్, ఖమ్మం కోర్టు నష్ట పరిహారం చెల్లించాలంటూ ఉత్తర్వులు జారీ చేసింది. నాగరాజుకు మృతుని కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది.

ఆర్థికసాయం అందజేత

ఖమ్మంచర్చికాంపౌండ్, నవంబరు1(ఆంధ్రజ్యోతి): ఇటీవల మృతి చెందిన నిరుపేద పద్మశాలి కుటుంబాల దహన సంస్కారాల నిమిత్తం ఖమ్మం జిల్లా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ పద్మశాలి సంఘం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కమర్తపు మురళి శనివారం ఆర్థికసహాయం అందించారు. ఇటీవల నగరంలో నలుగురు పద్మశాలి కులస్తులు మృతి చెందగా, ఒక్కొక్క కుటుంబానికి రూ.6వేల వంతున మొత్తం రూ.24వేలను అందించారు. ఈసందర్భంగా మురళి మాట్లాడుతూ గత 15 ఏళ్ల నుంచి అనేక సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో చిలకమర్రి శ్రీనివాసబాబు, పెండెం జనార్దన్, బండారు శ్రీను, దుస్సా సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రైతులను ముంచిన మొంథా తుఫాన్

» మండలంలో 950ఎకరాల్లో నష్టం అంచనా

నేలకొండపల్లి, నవంబరు1(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ రైతులను నిలువునా ముంచేసింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట ఒక్క గాలి వానకు కొట్టుకుపోయింది. రేపో, మాపో పంట ఇంటికొస్తుందన్న ఆశతో ఉన్న రైతు ఆశలపై మొంథా తుఫాన్ నీళ్ళు చల్లింది. కొన్ని పొలాలు నీళ్లల్లో నానుతుండగా మరికొన్ని కోత కోయటానికి వీల్లేకుండా కింద పడిపోయాయి. మండలంలోని పాతకొత్తూరు, ఆరెగూడెం, రామచంద్రాపురం తదితర గ్రామాల్లో ముఖ్యంగా ఏటి పక్కన ఉన్న రామచంద్రాపురంకు చెందిన పొలాలు పూర్తిగా నీట మునిగి ఇప్పుడిప్పుడే తేరుకుంటున్నాయి. మండలంలో మొత్తం 28,650 ఎకరాల్లో వరి పంటను రైతులు వేశారని, అందులో దాదాపుగా 950 ఎకరాలు పూర్తిగానూ, పాక్షికంగానూ దెబ్బతిన్నట్లు మండల వ్యవసాయాధికారి రాధ చెప్పారు.

రూ.50 వేల నష్ట పరిహారం ఇవ్వాలి

నష్టపోయిన ప్రతి రైతుకు, ప్రతి ఎకరాకు రూ.50వేలు నష్ట పరిహారంగా అందించాలని సీపీఎం అనుబంధ తెలంగాణ రైతు సంఘం డిమాండ్ చేసింది. రైతు సంఘం నాయకులు దెబ్బతిన్న పలు వరి క్షేత్రాలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి వివరాలు తీసుకున్నారు. నష్టపోయిన వారిలో ఎక్కువగా కౌలు రైతులే ఉన్నారని, వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



ఆరెగూడెంలో నేలకొరిగిన వరి

రైతులను ఆదుకోవాలి

తిరుమలాయపాలెం, నవంబరు1(ఆంధ్రజ్యోతి): తుఫాన్‌తో పంటలు నష్టపోయిన రైతులను అన్ని విధాలా ఆదుకోవాలని ఏఐయూకేఎస్ రాష్ట్ర నాయకుడు కమ్మకోమటి నాగేశ్వరరావు తెలిపారు. శనివారం మండలంలోని పిండిప్రోలులో రాయల వెంకటనారాయణ స్మారకభవనంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీవర్షంతో పత్తి, మిర్చి, వరి పంటలు నష్టపోయి రైతులు ఆర్థికంగా ఇబ్బందులుపడ్డారని, పంటల నష్టాలను అంచనా వేసి రైతులను ఆదుకోవాలన్నారు. చేతికి వచ్చిన పంటలు నేల మట్టమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో తిమ్మిడి హనుమతరావు, యడ్లపల్లి నవీన్, మీగడ సత్యం, వెంకటస్వామి, అరెంపుల వెంకన్న, రాయింఢ్లచిరంజీవి, పరికపల్లి మధు పాల్గొన్నారు.

సమగ్ర వ్యవసాయ విధానాల ద్వారానే ఆదాయం పెంపు



మాట్లాడుతున్న ఏడీఏ కొంగర వెంకటేశ్వరరావు

రఘునాథపాలెం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రైతులు సమగ్రమైన వ్యవసాయ విధానాలను పాటించటం ద్వారా నిరరాదాయం పెంపు జరిగి వ్యవసాయ రంగం లాబాలు బాటలో నడుస్తుందని, నీటి వసతి ఉన్న ప్రాంతాల్లో దానికి తగిన విధంగా పంటలను సాగు చేయాలని ఖమ్మం వ్యవసాయ ఉపసంచాలకులు కొంగర వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం రఘునాథపాలెం మండలం చిమ్మపూడిలో నిర్వహించిన రైతు అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మంచుకొండ ఎత్తిపోతల పథకం ద్వారా మండలంలోని అన్ని చెర్వులకు సాగునీరు అందుతోందని అందుకే స్థానికంగా ఉన్న రైతులు ఆయిల్ ఫామ్ సాగుపై దృష్టి సారించాలని అవగాహ న కల్పించారు. అంతర్ పంటలను సాగు చే సుకునే వెసులుబాటు ఉందన్నారు. అశ్వరావుపేట కళాశాల అసోసియేట్ డీన్ హేమంత్‌కుమార్ మాట్లాడుతూ మిరప పంటల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రోటరి క్లబ్ గవర్నర్ మల్లా వాసు మాట్లాడుతూ రోట రీక్లబ్ ద్వారా చేపట్టే కార్యక్రమాలను వివరించారు.

ప్రజా సమస్యల పరిష్కారం కోసం పని చేయాలి

» సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు అశోక్



సమావేశంలో మాట్లాడుతున్న ఆవుల అశోక్

ఖమ్మం కార్పొరేషన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా గుర్తింపు పొందిన భారతదేశంలోని ప్రజలు ఇప్పటికి సమస్యల వలయంలో నుంచి బయటపడలేదని, ప్రజా సమస్యల పరిష్కారం, సమానత్వం, సోషలిజాన్ని స్థాపించే లక్ష్యంతో పనిచేయాల్సిన కమ్యూనిస్టు పార్టీలు అతివాద, మితవాద ధోరణులతో వెళ్తున్నాయని, అయినా కమ్యూనిస్టులపై ప్రజలకు విశ్వాసం పెరుగుతుందని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు ఆవుల అశోక్ పేర్కొన్నారు. శనివారం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన అమరవీరుల సంతాప సభలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలపై కమ్యూనిస్టులు ప్రజాపంథా పోరాటంలో పనిచేయాల్సిన అవశ్యకత ఉందన్నారు. వందేళ్ల కమ్యూనిస్టుల ఉద్యమాలు, 58ఏళ్ల విప్లవోద్యమాల్లో ఎన్నో అమరుల బలిదానాలు జరిగాయని వివరించారు. కష్టాలు, నష్టాలను ఎదుర్కొని పీడిత ప్రజల కోసం కమ్యూనిస్టు పార్టీలు నిలబడ్డాయని తెలిపారు. సమాజంలో ప్రశ్నించే కమ్యూనిస్టులు లేకుంటే సమాజం మరింతగా సమస్యల్లోకి వెళ్లుందన్నారు. ప్రజల దైనందిన సమస్యలు పరిష్కారం కోసం భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం ఆత్మ గౌవరం కోసం అనేక ఉద్యమాలు కమ్యునిస్టులు చేశారని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల్ని మభ్య పెడుతున్నాయని ఆరోపించారు. నాయకులు ఝాన్సీ, కే శ్రీనివాస్, ప్రతాపనేని శోభ, లెనిన్, సత్తార్, చందు, జాస్మిన్, సుధాకర్, నర్సింహారావు, శారద, సుజాత, లక్ష్మీబాయి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'స్మార్ట్‌కిడ్జ్' వన సమారాధన



వనభోజనాలు చేస్తున్న విద్యార్థులు

ఖమ్మం ఖానాపురం హవేలి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా నగరంలోని స్మార్ట్ కిడ్జ్ చిన్నారుల వనసమారాధన శనివారం చెరుకూరి మామిడి తోటలో ఉత్సాహంగా జరిగింది. చిన్నారులు చేసిన నృత్యాలతో పాటు పలు రకాల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కళాకారుల మ్యాజిక్ ప్రదర్శన అలరించింది. పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ వన సమారాధనతో విద్యార్థుల్లో పచ్చదనం పట్ల అవగాహన, వాటిని దైవాలుగా పూజించే నడవడిక అలవడుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఖమ్మంలో విజయ డయాగ్నోస్టిక్ సెంటర్ ప్రారంభం



విజయ డయాగ్నోస్టిక్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : దేశంలోనే అతిపెద్ద బీ2సీ ఇంటిగ్రేటెడ్ డయాగ్నోస్టిక్ విజయ డయాగ్నోస్టిక్ సెంటరు ఖమ్మం నగరంలో అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చైర్మన్ డాక్టర్ సురేందర్ రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ సుప్రితారెడ్డి తెలిపారు. ఈ కేంద్రంలో అత్యుత్తమ సేవలను అందించడంతో పాటు, అందుబాటు ధరల్లో ఖచ్చితమైన డయాగ్నోస్టిక్ సేవలను అందించాలన్నదే లక్ష్యం అన్నారు. ఖమ్మంలోనే తొలిసారిగా అధునాతన 3 టెస్లా ఎంఆర్ఐ, 160-స్లైస్ కార్డియాక్ సీటీ, బీఎమ్‌డీ డెక్సా స్కాన్ లాంటి అత్యాధునిక పరికరాలు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలకు అత్యాధునిక సాంకేతికతతో పాటు అనుభవజ్ఞులైన వైద్య నిపుణులతో సేవలందిస్తున్నట్లు వివరించారు. 3 టెస్లా ఎంఆర్ఐ, 160-స్లైస్ సీటీ స్కాన్, బీఎమ్‌డీ డెక్సా స్కాన్, డిజిటల్ ఎక్స్‌రే, డెంటల్ ఓపీజీ, 3డీ/4డీ అల్ట్రాసౌండ్, స్ట్రెస్ టీఎంసీ, ఈసీజీ, 2డీ ఎకో, పీఎఫ్‌టి, యూరోఫ్లోమెట్రీ, స్పెషాలిటీ ల్యాబ్ సర్వీసులు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. జిల్లాలో ప్రజలకు పెరుగుతున్న ఆరోగ్య అవసరాలను తీర్చడంలో ఒక విజయ డయాగ్నోస్టిక్ సెంటర్ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఆన్‌లైన్ బుకింగ్, హోమ్ సాంపిల్ కలెక్షన్, త్వరిత రిపోర్ట్ యాక్సెస్ వంటిసేవలు విజయ డయాగ్నోస్టిక్ సెంటర్ మొబైల్ యాప్ ద్వారా అందుబాటులో ఉన్నట్లు వివరించారు. ఈ సేవలను ప్రజలు సద్వినియోగించుకోవాలని కోరారు.

కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ సీతారాములు

నేలకొండపల్లి, నవంబరు1(ఆంధ్రజ్యోతి): మార్కెట్‌యార్డులో డీసీఎమ్మెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ మార్కెట్ చైర్మన్ సీతారాములు కోరారు. శనివారం మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అధికారులతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం సీతారాములు మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ముందు జాగ్రత్తగా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తుందన్నారు. కార్యక్రమంలో నెల్లూరి భద్రయ్య, బొడ్డు బొందయ్య, మామిడి వెంకన్న, రామకృష్ణ, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంఏవో రాధ, ఏఈవో అరవింద్, మార్కెట్ కార్యదర్శి పంతులు, సిబ్బంది, హమాలీలు పాల్గొన్నారు.

9న ఆర్యవైశ్యుల వనసమారాధన



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరం ఆర్యవైశ్యుల వనసమారాధన నవంబరు 9న గొల్లగుడెం రోడ్‌లోని చెరుకూరి మామిడి తోటలో నిర్వహిస్తున్నామని వనసమారాధన ఆహ్వాన కమిటీ కన్వీనర్ చిన్ని కృష్ణారావు అన్నారు. శనివారం నగరంలోని ఆర్యవైశ్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పలువురు సంఘం నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కన్వీనర్ చిన్ని కృష్ణారావు మాట్లాడుతూ ఆర్యవైశ్యకుటుంబ సభ్యులందరూ వనబోజనాల కార్యక్రమాని తప్పక హాజరుకావాలని కోరారు. చెరుకూరి. కృష్ణమూర్తి, మేళ్లచెర్వు వెంకటేశ్వరరావు, కొప్పు నరేష్, కురువెళ్ల ప్రవీణ్‌కుమార్, పసుమర్తి రాంమోహన్‌రావు, కొదుమూరి మధుసూధన్‌రావు, డీపీసీ రావు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటికీ సంక్షేమ పథకాలు

ఖమ్మం కార్పొరేషన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ రాజ్యంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవతో ఇంటింటి సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందుతున్నాయని 46వ డివిజన్ కార్పొరేటర్ కన్నం వైష్ణవి తెలిపారు. శనివారం డివిజన్‌లో లబ్ధిదారుల నివాసాలకు వెళ్లి కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఖమ్మం నగరంలో జరుగుతున్న అభివృద్ధిని వివరించారు. కన్నం ప్రసన్న కృష్ణ, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ రజ్జి, మాజీ కౌన్సిలర్ సంగం అంజయ్య, దయ్యాల నాగేశ్వరరావు, రామకృష్ణ, తుపాకుల మధు, గుంటుపల్లి పద్మ, ఫైమద్, ఉపేందర్ తదితరులున్నారు.

స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలి

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఖమ్మం జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుతున్న విధానాన్ని ఖండిస్తూ, విద్యార్థులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నిరసనకు దిగారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రణీత్ మాట్లాడుతూ స్కాలర్‌షిప్‌లు ప్రభుత్వం ఇచ్చే భిక్షలు కావు, అవి విద్యార్థుల రాజ్యాంగబద్ధమైన హక్కులు. మధ్యతరగతి, పేద కుటుంబాల విద్యార్థులు ఉన్నత విద్యను కొనసాగించడానికి ఈ నిధులు ప్రాణాధారాలు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి కార్తీక్, ఉపాధ్యక్షుడు అజయ్, సంయుక్త కార్యదర్శి దీపక్, మధు, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

రేవంత్ వ్యాఖ్యలపై బీజేపీ ఆగ్రహం



సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

ఖమ్మంబైపాస్‌రోడ్, నవంబరు1(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై జిల్లా బీజేపీ అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం నగరంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ వద్ద పార్టీ కార్యకర్తలు పెద్దఎత్తున రేవంత్‌రెడ్డి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. భారతసైన్యాన్ని విమర్శిస్తూ మాట్లాడిన ముఖ్యమంత్రి వ్యాఖ్యలను ఖండిస్తూ అనంతరం దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈసందర్భంగా నెల్లూరి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటినుంచి ఆయన వైఖరి దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా ఉందని ఆరోపించారు. భారత సైన్యం దేశగౌరవం కోసం రాత్రింబవళ్లు కాపలాకాస్తుంటే ముఖ్యమంత్రి మాత్రం పాకిస్తాన్‌పక్షాన మాట్లాడడం సిగ్గుచేటన్నారు. భారత సైన్యం ప్రపంచం గౌరవపడేలా ఆపరేషన్ సింధూర్‌లో విజయవంతం చేసిందన్నారు. ఈకార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నల్లగట్టు ప్రవీన్, జిల్లా మీడియా కన్వీనర్ డాక్టర్ నెల్లూరి బెనర్జి, వీరెల్లి రాజేష్, నకరికంటి వీరబద్రం, రవిరాథోడ్, సుబ్బారావు పాల్గన్నారు.

వరద ప్రాంతాల్లో వైద్య బృందాల పర్యటన

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ ప్రభావంతో మున్నేరు వరద ముంపు ప్రాంతాల్లో వైద్యఆరోగ్యశాఖ అధికారులు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. వరద తాకిడికి గురైన ప్రాంతాలు వెంకటేశ్వరానగర్ అర్బన్ హెల్త్ సిబ్బంది శనివారం పర్యటించారు. జిల్లా కలెక్టర్, జిల్లా వైద్యధికారి ఆదేశాల మేరకు బొక్కలగడ్డ, మోతీనగర్, పద్మావతీనగర్‌లో సర్వేనిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నాగమణి, సూపర్‌వైజర్లు జయపాల్, మన్నన్, చావా రజినీ, సిబ్బంది శిరీష, శారద, రహీంబి, ప్రసన్న, కావ్య పాల్గొన్నారు.

మంచుకొండ వైద్యాధికారి ఆధ్వర్యంలో...

రఘునాథపాలెం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్యకేం ద్రం మంచుకొండ వైద్యాధికారి బాలకృష్ణ ఆధ్వర్యంలో వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వాటర్‌బోర్న్ వ్యాధుల నివారణ చర్యలతో పాటు ఫీవర్ సర్వే నిర్వహించారు. ధంసలాపురం కాలనీలో ప్రజలకు ప్రస్తుత వ్యాధులపు ఆరోగ్య అవగాహన కల్పించి, అవసరమైన మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పల్లె దవాఖాన వైద్య సిబ్బంది ఏఎన్ఎం ఆశావర్కర్లు, హెల్త్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.



సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కేఎంసీలో చిట్టీల వ్యాపారం జోరు



ఖమ్మం కార్పొరేషన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రజలను ఆర్థికంగా నష్టాలకు గురిచేసే ప్రైయివేట్ చిట్టీల వ్యాపారాన్ని ప్రభుత్వం నిషేధించింది. కేవలం రిజిస్ట్రేషన్ చిట్టి వ్యాపారులు మాత్రమే రిజర్వ్ బ్యాంకు నిబంధనల మేరకు ప్రారంభించే చిట్టిలో కొంతమెత్తాన్ని డిపాజిట్‌గా ఉంచి తర్వాతనే చిట్టిల వ్యాపారానికి అనుమతి ఇస్తారు. అయితే ఇప్పుడు ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో ఓ ఉద్యోగి చిట్టిల వ్యాపారం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఆ ఉద్యోగి ఏకంగా ఖమ్మం నగర పాలక సంస్థలో ఉద్యోగుల బాగోగులు, సర్వీస్ చూడాల్సిన కీలక బాధ్యతలను అప్పగించారు. ఇంకే ముంది వందల సంఖ్యలో ఉద్యోగులు సర్వీస్ రికార్డులు, సెలవులు ఆ ఉద్యోగి చేతిలోకి చేరాయి. కేఎంసీలోని ఉద్యోగులు ఆ ఉద్యోగి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో ఇంకేముంది ఆ ఉద్యోగి ఉద్యోగంతో పాటుగా అదనపు ఆదాయంగా చిట్టిల వ్యాపారాన్ని ప్రారంభించారు. ప్రతి నెల చిట్టిలు నడుపుతూ అదనపు ఆదాయాన్ని రాబడుతున్నారు.



రెండు నెలల్లో సమస్యల పరిష్కారం

- స్థానికులు అధికారులకు సహకరించాలి
- ముంపునకు గురవుతున్న ప్రాంతాలను పరిశీలించిన కలెక్టర్



సమస్యల పరిశీలనలో భాగంగా స్థానికులతో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్

మధిర, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మధిర మునిసిపాలిటీ పరిధిలో వర్షాలకు తరచూ ముంపుకు గురవతున్న ముస్లిం కాలనీ, హనుమాన్ కాలనీ, రామనాదం కాలనీ ప్రాంతాలను కలెక్టర్ అనుదీప్ ధురిశెట్టి శనివారం పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ కాలనీలలో వర్షపు నీరు ఇండ్లు, రోడ్లను ముంచెత్తడంతో విషయం తెలుసుకున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కలెక్టర్‌ను క్షేత్రస్థాయిలో సమస్యను తెలుసుకుని శాశ్వత పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించడంతో కలెక్టర్ శనివారం ముంపు ప్రాంతాల్లో పర్యటించి అక్కడ ఏర్పడ్డ సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. సమస్యలు పరిష్కారం అయ్యేందుకు ప్రజలు సహకరించాలని ఎవరికి వారు తమ ఇంటి ముందు నీళ్ల పోవటానికి వీలు లేదని ఇంటి ముందు కాలువలు, మోరీలు పూడిస్తే వర్షం నీరు ఎలా పోతుందో చెప్పాలన్నారు. ప్రజలు సహకరిస్తే వచ్చే వర్షాకాలం నాటికి ముంపుకు గురి కాకుండా వర్షం నీరు అంత చెరువులో కలిసేలా చేస్తామన్నారు. ఫేజ్1, ఫేజ్2 కింద పనులు చేపడతామని తక్షణమే ఫేజ్1 కింద అన్ని రోడ్ల వెంట రెయిన్ వాటర్ డ్రెయిన్‌లు నిర్మిస్తామని అవి పూర్తయ్యాక అన్ని రోడ్లను సిమెంట్ రోడ్లుగా మారుస్తామని అన్నారు. చెరువును ఫుల్‌ట్యాంక్ లెవల్ లో నింపవద్దని అలా చేస్తే బ్యాక్ వాటర్‌తో కొన్ని రోడ్లు ముంపుకు గురవుతాయని చెరువులో ఓ 20శాతం ఖాళీగా ఉండేలా చూడలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. ఆ తరువాత మునిసిపల్ కార్యాలయంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులతోపాటు పలు కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ సంపత్ కుమార్, తహసీల్దార్ రాంబాబు, టీపీవో శ్రీనివాసరావు, మునిసిపల్ డీఈ నరేష్ రెడ్డి, ఆర్ఐ భానుప్రసాద్, మాజీ కౌన్సిలర్ మల్లాది వాసు నాయకులు పాటిబండ్ల సత్యంబాబు, దుంపా వెంకటేశ్వరరెడ్డి, నిడమానూరు వంశీ తదితరులు పాల్గొన్నారు.

మంచుదుప్పటి పరుచుకున్న సత్తుపల్లి



సత్తుపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా చలికాలంలో రావాల్సిన మంచు నవంబరు నెలప్రారంభం రోజే వచ్చేసింది. శనివారం తెల్లవారే సరికి శీతాకాలాన్ని తలపించే రీతిలో దట్టంగా పొగమంచు కమ్మేసింది. శీతలగాలులు సైతం ఆహ్లాదపరిచాయి. సత్తుపల్లిలో భూమిపై మంచు తెరలు కమ్ముకున్నాయా అనే విధంగా మంచు కురిసింది. కనీసం ఎదురెదురు మనుషులే కనిపించనంతగా.. పొగ కమ్మేసిందా అన్నట్లుగా మంచు పట్టణాన్ని ఆవహించింది. మండుటెండలతో పాటు భారీవర్షాలు కురుస్తుండగా ఎండతీవ్రత రోజూ ఇటీవల 30-40డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ వాతావరణంలో మార్పులతో రైతులు ఆయోమయానికి గురవుతున్నారు.



శ్రీవారి నిత్యకళ్యాణంలో పాల్గొన్న భక్తులు

ముత్యాలకవచాలంకరణంలో జమలాపురం శ్రీవారు

ఎర్రుపాలెం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ది గాంచిన శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయలో శనివారం అర్చకులు సర్వాంగాభిషేకంనిర్వహించి ముత్యాలకవచాన్ని అలంకరించారు. ఆలయ అర్చకుడు ఉప్పల శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో తెల్లవారుజామున పంచామృతాలు, సుగంధద్రవ్యాలతో సర్వాంగాభిషేకం నిర్వహించి ముత్యాల అలంకారంలో భక్తులకు దర్శనం కలిపించారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీవారి ఉత్సవాలను పల్లకీలో ఊరేగించి కళ్యాణ వేదిక వద్దకు చేర్చి నిత్యకళ్యాణం నిర్వహించారు. శ్రీవారి ఆలయంతోపాటు భక్తులు ఉపాలయాలను దర్శించుకున్నారు.శ్రీవారిని దర్శించుకున్న భక్తులకు సిబ్బంది అన్నవితరణ చేశారు.

వైభవంగా సామూహికసత్యనారాయణ వ్రతం

కార్తీక ఏకాదశ సందర్భంగా శనివారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాన్ని నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడి ఆధ్వర్యంలో చుట్టుపక్కల గ్రామాలకు చెందని 52 మంది దంపతులతో ఈవ్రతం నిర్వహించారు. లోకకళ్యాణార్థం, భక్తుల కష్టాలను తొలిగించి, సమాజంలో సత్యనిష్టను స్థాపించేందకు సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహిస్తారని అర్చకులు తెలిపారు. దేవాదాయశాఖ కమిషనర్ ఆదేశాలతో ప్రతి సోమవారం ఏకాదశి, పౌర్ణమి తిథులలో వ్రతాలు ఎటువంటి రుసుంలేకుండా ఉచితంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆలయ ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, సీనియర్ అసిస్టెంట్ సోమయ్య, జూనియర్ అసిస్టెంట్ ఇరుకుల పాటి కృష్ణప్రసాద్, అర్చకులు రాజీవ్‌శర్మ, మురళీమోహన్‌శర్మ, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సత్తుపల్లిలో..

సత్తుపల్లిరూరల్: కార్తీక మాసం సందర్భంగా పట్టణంలోని పురాతన ఆలయం శ్రీ కోదండ రామాలయంలో శనివారం సామూహిక శ్రీ సత్యనారాయణస్వామి వ్రతం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అభిషేకాలు, బిల్వ అర్చన, స్తోత్ర పారాయణాలు, శివనామ స్మరణలలు చేశారు. అష్టైశ్వరాలు కురిపించే ఈ వ్రతాన్ని ఆచరించడం ద్వారా కష్టనష్టాలు తొలగి ధనధాన్యాలకు లోటుండదని, సౌభాగ్యకరమైన సంతానం, సర్వత్రా విజయాలు లభిస్తాయని ఆలయ అర్చకులు రవిశాస్త్రీ అన్నారు. కార్యక్రమంలో నడిపల్లి అర్జున్‌రావు, అనుమోలు సురేష్, కొత్తూరు సత్యనారాయణ, తోట రమేష్, కనిగళ్ల వినయ్, అడపా సాయి, దొడ్డా వెంకటరామారావు, కోరుకొండ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి

వేంసూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వేంసూరులో సొసైటీ, భీమవరంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మాణిక్యరావు, సొసైటీ సీఈఓ మందపాటి శ్రీనివాసరెడ్డి, ఐకేపీ ఏపీఎం సుబ్బారావు, సొసైటీ అధ్యక్షుడు తక్కెళ్లపాటి గోపాలకృష్ణ, కాంగ్రెస్ నాయకులు కాసర చంద్రశేఖరరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, నరసింహారావు, అక్బర్, బింగి గాంధీ తదితరులు పాల్గొన్నారు.

చింతకాని: మండల పరిధిలోని నాగులవంచలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మత్కేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వర్లు ప్రారంభించారు. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తేమ లేకుండా ఎండబెట్టిన ధాన్యాన్ని రైతులు కేంద్రాలకు తీసుకురావాలన్నారు. చైర్మన్ నల్లమోతు శేషగిరిరావు, సీఈవో శ్రీనివాస్‌రావు, తహసీల్దార్ బాబ్జీ ప్రసాద్, ప్రత్యేక అధికారి నవీన్‌బాబ పాల్గొన్నారు.

వైరా: వైరా మున్సిపాలిటి పరిధిలోని సోమవారం గ్రామంలో శనివారం మెప్మావారి సహకారంతో మున్సిపాలిటి వారిచే ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వైరా వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ బొళ్ల గంగారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, మున్సిపల్ కమిషనర్ గురులింగం, ఏఈవో రాజేష్, మెప్మా డిఎంసి సుజాత,మెప్మా ఆర్పిలు నీరజ, రజనీ, సునీత, నాగమణి, జయశ్రీ, దుర్గ పాల్గొన్నారు.

పెనుబలి: పెనుబల్లి మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన 19 మంది కళ్యాణలక్ష్మి , షాదీముబారక్ లబ్దిదారులకు సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ పెనుబల్లి రైతు వేదిక వద్ద చెక్కులను శనివారం అందజేసారు. ఈ సందర్భంగా లబ్దిదారులకు తెలంగాణా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక పథకాల గురించి ఆమె వివరించారు. కల్లూరు ఏఎంసీ చైర్‌పర్సన్ నీరజ ప్రభాకర్, తహశీల్దార్ శ్రీనివాస్‌యాదవ్, ఐకేపీ ఏపీయం. కల్పన, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధికారులు పాల్గొన్నారు.

ఖమ్మం-ఇల్లెందు రహదారిలో మరమ్మతులు చేపటాలి

కారేపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు ఇల్లెందు-ఖమ్మం ప్రధానరహదారి పూర్తిగా దెబ్బతిని అడుగు నుంచి రెండు, మూడు అడుగు లోతు గుంతలు ఏర్పడి ప్రయాణికులకు, వాహనదారులకు ఇబ్బందికరంగా మారిందని, రహదారిలో మరమ్మతులు చేపట్టాలని సీపీఐ(ఎంఎల్)నాయకురాలు చంద్రఅరుణ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రజాప్రతినిధులకు, సంబ ంధిత అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్న పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైన అధికారులు స్పందించి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని అరుణ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అవుల అశోక్,గుమ్మడి సందీప్, తేజ నాయక్, పాయ వెంకన్న, ఉపేందర్ పాల్గొన్నారు.

అక్షరాస్యత సాధనకు కృషి చేయాలి

కల్లూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): అక్షరాస్యత సాధనకు గ్రామ సమైక్యలు, వాలింటీర్లు కృషి చేయాలని ఐకేపీ ఏపీఎం అశోక్‌రాణి కోరారు. కల్లూరులోని ఐకేపీ కార్యాలయంలో శనివారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని 23 గ్రామ పంచాయితీల్లో నిరక్షరాస్యుల సర్వే నిర్వహించడం జరిగిందని వారిని అక్షరాస్యులుగా చేసేందుకు వాలంటీర్లు, గ్రామసమైక్యలు, వివోఏలు కృషి చేయాలని పిలుపు నిచ్చారు. రాబోయే రోజుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. నిరాక్షరాస్యులుగా గుర్తించిన వారిని ఒక ఏడాది లోగా అక్షర్యాస్యులుగా తీర్చిదిద్దాలని కోరారు. ఈ బాధ్యత అందిరిపై ఉందని ప్రతి రోజు ఓ గంట వారికి పంపిణి చేసిన పుస్తకాలు ద్వారా చదవును నేర్పించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సమైక్యలు, సీసీలు పాల్గొన్నారు.

నేడు వంగవీటి విగ్రహావిష్కరణ

- హాజరవనున్న మాజీ ఎమ్మెల్యే రాధాకృష్ణ

సత్తుపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి మునిసిపల్ కార్యాలయం ఎదురుగా మున్నూరు కాపు సంఘం, వంగవీటి మోహన్‌రంగా యూత్ సంయుక్త ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటుచేసిన మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహన్‌రంగా ఏడడుగుల కాంస్య విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం నేడు నిర్వహించనున్నట్లు మున్నూరు కాపు కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం సత్తుపల్లి పట్టణంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. ఉదయం 10గంటలకు జరిగే మోహన్‌రంగా విగ్రహావిష్కరణకు ఆయన తనయుడు మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ రానున్నారని, అనంతరం జరిగే బైక్, కార్ల ర్యాలీని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తోట గణేష్‌బాబు జీడిమామిడి తోటలో జరిగే వనసమారాధన కార్యక్రమంలో సకుటుంబ సపరివార సమేతంగా హాజరవ్వాలని కోరారు. రంగిశెట్టి చంటి, కాల్నేని సాయి, తోట గణేష్‌బాబు, పెద్దిరెడ్డి పురుషోత్తం, నల్లాకుల సూరిబాబు, బత్తుల రాంబాబు, హరి, మూలగుండ్ల అప్పారావుపాల్గొన్నారు.

ఘనంగా ఇందిరమ్మ గృహ ప్రవేశ వేడుకలు



టీ.వెంకటాపురంలో ఇందిరమ్మ గృహ ప్రవేశం చేస్తున్న లబ్ధిదారులు

కల్లూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మండలంలోని టీ.వెంకటాపురం గ్రామంలో శనివారం పలువురు ఇందిరమ్మ గృహప్రవేశాలను వేడుకగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ఆ గ్రామ మాజీ సర్పంచు తోటకూర శేషగిరిరావు, లక్ష్మీ దంపతులు ముఖ్యఅతిథులుగా పలు గృహాల ప్రారంభ వేడుకల్లో పాల్గొన్నారు. టీ.వెంకటాపురంలో రాష్ట్ర ప్రభుత్వం తరుపున 20కిపైగా ఇందిరమ్మ గృహలు మంజూరు కాగ వాటిలో పలు గృహాలు నిర్మాణ పురోగతిలో ఉండగా మరి కొన్ని గృహాలు పూర్తయ్యాయి. పూర్తైన వాటిలో లబ్ధిదారుల కుటుంబాలు గృహ ప్రవేశం చేశారు. రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయిల చొరవతో తమ గ్రామంలో అర్హులైన పేదలకు ఇందిరమ్మ గృహాలు మంజూరు కావడం పట్ల లబ్ధిదారలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ నాయకులు శీలం బ్రహ్మారెడ్డి, భుక్యా రవీంద్రబాబు, జొన్నలగడ్డ ప్రసాద్ దొబ్బల రామారావు, రామిశెట్టి కృష్ణ తదిరులు పాల్గొన్నారు.

ఆదుకుంటే తప్ప కోలుకోలేం

- మొంథా తుఫాన్‌తో అన్నదాత కంట కన్నీరు

తల్లాడ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మొంథాతుఫాన్ ప్రభావం వల్ల ఈదురుగాలులుతో కురిసిన భారీవర్షాలు ఆరుగాలం అనేక వ్యయప్రయాసలకోర్చి పండించిన పంటలు చేతికొచ్చిన తరుణంలో తీరని నష్టాలు మిగిల్చాయి. వానాకాలం సీజన్ ఆద్యంతం అన్నదాతలు అనేక వ్యవయప్రయాసలను ఎదుర్కొన్నారు. వ్యవసాయసీజన్ ఆరంభంలో వర్షాభావం ఆతర్వాత అధికవర్షాలు రైతులను నిండా ముంచాయి గండాలన్నీ గడిచాయని భావిస్తున్న తరుణంలో మొంథా తుఫాన్ కోలుకోలేని దెబ్బ తీసింది. కోతకు వచ్చిన వరితోపాటు గింజకట్టే దశలో ఉన్న వరిసేలవాలింది. వరికోతలు ఆలస్యమై గింజరాలే పరిస్థితి ఏర్పడింది. పత్తి కాత రాలిపోయింది. తీసే దశకు వచ్చిన పత్తి దూదిపింజలు తడిచి ఉబ్బిపోయాయి. ఏపుగా ఎదిగిన పూత, కాయదశలో ఉన్న మిర్చి తోటలు పడిపోయాయి. పడిపోయిన మిర్చిమొక్కలను తిరిగి పైకిలేపేందుకు అదనపు ఖర్చు అవుతుంది. ఆరుగాలం కష్టపడి పెట్టుబడి పెట్టి పండించిన పంటలు వర్షార్పణం కావడంతో అన్నదాతలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వం తమను ఆదకుంటే తప్ప కోలుకోలేమని తల్లాడ రైతులు వాపోతున్నారు

వరిపైరు వరదలో మునిగింది..



పొన్న వెంకటయ్య, రైతు అన్నారుగూడం

ఆరు ఎకరాల్లో వెదజల్లే పద్ధతిలో వరి సాగుచేశా. అధికవర్షాలతో ఎక్కువగా చీడపీడలు ఆశించడంతో పైరును కాపాడేందుకు ఎకరానికి రూ.40వేల చొప్పన పెట్టుబడి పెట్టాను ప్రస్తుతం వరి పైరు గింజ పోసుకునే దశలో ఉంది. దీనివల్ల వరికోతో ఆలస్యమై హార్వెస్టర్‌తో కోసేటప్పుడు ఎక్కువ సమయం పడుతుంది.

కేజీబీవీ పాఠశాల విద్యార్థిని అదృశ్యం

పెనుబల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఉప్పలచిలుక కస్తూర్బా పాఠశాల నుంచి శనివారం ఓ విద్యార్థిని అదృశ్యమైన సంఘటన వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని ఉప్పలచిలుక కేజీబీవీ బాలికల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న 14 సంత్సరాల ఓ బాలిక సాయంత్రం క్రీడా మైదానంలో ఆటలాడేందుకు వెళ్లింది. ఈ సందర్భంగా పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థినిల హాజరు తీసుకునే క్రమంలో సదరు బాలిక హాజరు కాలేదు. ఈ సమయంలో సదరు విద్యార్థిని ఆచూకి కోసం పాఠశాల ఉపాధ్యాయులు ప్రయత్నించగా కనిపించలేదు. దీంతో పాఠశాల సమీపంలోని జాతీయ రహదారిపై ఉన్న టోల్ గేట్ వద్ద సీసీ టీవీ ఫుటేజిని పరిశీలించగా ఓ వ్యక్తితో ద్విచక్రవాహనంపై ఆ బాలిక వెళ్లినట్లు రికార్డు అయింది. ఈ మేరకు పాఠశాల ఉపాధ్యాయులు శనివారం రాత్రి స్థానిక పోలీసులకు పిర్యాదు చేయగా బాలిక అదృశ్యం అయినట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ధాన్యం కేంద్రాలను పరిశీలించిన సబ్‌కలెక్టర్

కల్లూరు, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): కల్లూరులోని శివాలయం ప్రాంగణంలో మోప్మా తరుపున ఏర్పాటు చేసిన ధాన్యం కేంద్రాలను సబ్‌కలెక్టర్ అజయ్‌యాదవ్ శనివారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రం నిర్వహాకులకు ఆయన పలు సూచనలు చేశారు. ధాన్యం సేకరణ ఏర్పాట్లను పరిశీలించారు. సిబ్బంది, రైతులతో మాట్లాడారు. ధాన్యం కొనుగోలులో నిభంధనలు అతిక్రమిస్తే తగిన చర్యలు తీసుకోవడం జరగుతుందన్నారు. పారదర్శకత పాటించాలని వారికి సబ్‌కలెక్టర్ సూచించారు. అదే విధంగా కేంద్రాల నిర్వహాణల రిజిష్టర్లను పరిశీలించారు. వాటి నిర్వహాణలో తగిన జగ్రత్తలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ పి సాంబశివుడు కేంద్ర నిర్వహాక మహిళ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.



గరికపాడులో బోరు పంపు ప్రారంభం



గరికపాడులో బోరు పంపును ప్రారంభిస్తున్న ఉపాధ్యాయుడు సత్యనారాయణ

వైరా నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గరికపాడు గ్రామంలో యావే సమాజ ప్రార్థన మందిరం వద్ద శనివారం జీ.ఎస్.ఎన్ (గ్రేస్ సర్వీస్ సొసైటీ)వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బోరు పంపును జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి.సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పల్లె ప్రాంతాల్లో పేద ప్రజలకు గ్రేస్ సంస్థ చేస్తున్న సేవలు మరవలేనివి అన్నారు. అనంతరం గ్రామస్థులు జీసస్ సంస్థ అధినేత బిషప్ జాకబ్‌కు కృతజ్ఞతలు తెలపారు. స్థానిక పాస్టర్లు బాబురావు, సురేష్, సులేమాన్, సంస్థ సిబ్బంది ఎర్నెస్ట్ పాల్, జాన్, సతీష్, నరేష్ గ్రామస్థులు పాల్గొన్నారు.

గాలికుంటు వైరస్‌తో పునరుత్పత్తి శక్తి తగ్గుతుంది

- జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసరావు



టీకాల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లాపశువైద్యాధికారి

సత్తుపల్లిరూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గాలికుంటు వైరస్ సోకితే పశువులలో పాల ఉత్పత్తితోపాటు పునరుత్పత్తి శక్తి తగ్గుతుందని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ బోడేపూడి శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఆయన సత్తుపల్లి మండలంలో ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా పశువైద్యశాలను సందర్శించారు. అనంతరం సిద్దారం, గౌరిగూడెంలలో నిర్వహిస్తున్న ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని సందర్శించి పలు సూచనలు చేశారు. గాలికుంటు వైరస్ సోకకుండా 4నెలలు వయసు దాటిన దూడలు, పశువులకు వ్యాధి నిరోదక టీకాలను ఖచ్చితంగా వేయించాలని చెప్పారు. ఈ క్రమంలో ఈనెల 13వ తేదీ వరకు నిర్వహించే ఉచిత టీకాల శిబిరాన్ని పాడిరైతులు సద్వినియోగించుకోవాలని చెప్పారు. పశువైద్యాధికారులు డాక్టర్ కే.ప్రదీప్, డాక్టర్ చిందనిప్పు శశిదీప్, సిబ్బంది చైతన్య, కరుణాకర్, సాధిక, లాల్‌బీ, రాధా, మల్లిఖార్జున్, నాగేశ్వరరావు, శ్రీను, విజయ్‌కుమార్, రామకృష్ణ, సైదులు, రవి, శేషగిరి, చెన్నారావు, కిరణ్, వేణు, పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం ప్రారంభం



అల్పాహార కార్యక్రమంప్రారంభిస్తున్న ఏఎంవో

ఏన్కూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): బురదరాఘవాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అల్పాహార క్యార్యక్రమాన్ని శనివారం ఏఎంవో పి.ప్రభాకరరెడ్డి, సీఎంవో బి.ప్రవీన్‌కుమార్ సంయుక్తంగా ప్రారంభించారు. పదో తరగతి పబ్లిక్‌పరీక్షలు అయ్యేంతవరకు ఉదయం అల్పాహారం ఉపాధ్యాయుల సహకారంతో అల్పాహారం అందించనున్నారు. ఈ సందర్భంగా హెచ్ఎం నాగిరెడ్డి మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి ఉదయం తప్పక సకాలంలో పాఠశాలకు రావాలని, అల్పాహారాన్ని తీసుకుని చదవు ప్రారంబిచాలని , ఆరోగ్యంగా ఉండాలని, ఆరోగ్యంగా ఉంటేనే శ్రద్ధగా చదవగలరని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డైరెక్టర్లు

సత్తుపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్ 2025-26గాను మండలంలోని కాకర్లపల్లి, బుగ్గపాడులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సొసైటీ ఉపాధ్యక్షులు శివన్నారాయణ కోరారు. దళారుల వద్దకు వెళ్లవద్దని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందుగానే కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నమన్నారు. ఈ క్రమంలో సన్నరకం క్వింటాకు రూ.2389, దొడ్డురకం రూ.2369కే ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేయడంతో పాటు రూ.500బోనస్‌ను అందిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో డైరెక్టర్లు కంచర్ల రమేష్, కొప్పుల రమేష్, కిలారి కేశవరావు, పలగాని రాములు, సీఈవో జవ్వాజి వినయ్‌కుమార్, ఏఈవో, రైతులు పువ్వాళ్ల ఉమా, గనేన్నీ రాంప్రసాద్, కిలారి వాసు, దొడ్డా సత్యనారాయణ పాల్గొన్నారు.

మొంథా తుఫాన్‌కు కొట్టుకుపోయిన రోడ్డుకు శ్రమదానం

బోనకల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను తాకిడికీ మండలంలోని ఆళ్లపాడు నుంచి నారాయణపురం వెళ్లే పంచాయతీ రాహదారి వాగు వరద ఉధృతికి కోతకు గురైంది. దింతో రైతుల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త మరీదు బరకయ్య, బీసీసెల్ కాంగ్రెస్ నాయకుడు కందుల పాపారావులు స్వంత ఖర్చులతో శనివారం మరమ్మత్తు పనులను నిర్వహించారు. రాకపోకలు సజావుగా సాగేలా కృషి చేసిన ఇద్దరు దాతలకు రైతులు, గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు బుంగా రాములు, మాజీ ఎంపీటీసీ పారా శ్రీదేవి, వెంకట మోహన్‌రావు, రామిశెట్టి కృష్ణ, వేల్పుల సురేష్ పాల్గొన్నారు.

జేఎన్‌టీయూహెచ్‌లో 'విజయ' విద్యార్థినికి గోల్డ్‌మెడల్



కొణిజర్ల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): 2024-25 సంవత్సరానికిగాను జేఎన్‌టీయూహెచ్ విశ్వవిద్యాలయం ప్రకటించిన గోల్డ్‌మెడల్ జాబితాలో విజయ ఇంజనీరింగ్ కళాశాల సీఎస్ఈ విభాగం విద్యార్థిని ఎం.శాంతి 8.87 సీజీపీతో గోల్డ్‌మెడల్‌కు ఎంపికైన్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ చిన్నయ్య శనివారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని కళాశాల చైర్మన్ పారుపల్లి ఉషాకిరణ్‌కుమార్, వైస్ చైర్మన్ పారుపల్లి విజయలక్ష్మీ అభినందించారు. సీఎస్ఈ విభాగాధిపతి సంధ్యారాణి, వైస్‌ప్రిన్సిపాల్ అయేషాతరుణం, డీన్ శ్రీనివాసరావు, ఏవో డాక్టర్ ఫరీద్‌బాబా విద్యార్థినిని అభినందించారు.

శివాలయంలో జంట నాగేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ



కారేపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లింగం బంజరగ్రామం శివాలయంలో శనివారం జంటనాగేంద్రస్వామి విగ్రహప్రతిష్ఠ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. శుక్రవారం రాత్రి విగ్రహన్ని కారేపల్లి క్రాస్ రోడ్డు, లింగం బంజర గ్రామంలో భక్తిశ్రద్దలతో ఊరేగించారు. అనంతరం ఆలయంలో పూజారి వీరభద్రచారి ఆధ్వర్యంలో ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యాక్రమానికి పరిసరప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పొదిలి బిక్షమయ్య కుటంబ సభ్యులు, విగ్రహదాత పొదిలి శశికుమారు దంపతులు, కమిటి సభ్యులు పాల్గొన్నారు.

మహిళలకు కుట్టు మిషన్ల వితరణ

వైరా, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మహిళలలు ఆర్థికంగా తోడ్పాటును ఇచ్చే విధంగా కుట్టు మిషన్లు ఉపయోగపడతాయని ఫాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్ డాక్టర్ కాప మురళీకృష్ణ అన్నారు. శనివారం వైరా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ కంటి ఆసుపత్రి నందు వైరాకు చెందిన ఇద్దరు నిరుపేద మహిళలకు కుట్టు మిషన్లు అందజేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లయన్స్‌క్లబ్ ద్వారా ఎంతో మంది మహిళలకు వారి ఉపాధికి ఉపయోగపడే విధంగా పలు రకాలుగా సహాయ సహకారాలు అందించడం జరిగిందన్నారు. భవిష్యత్‌లో నిజమైన నిరుపేదలకు ఇదే విధంగా సహకారం అందించడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. మార్కెటింగ్ కోఆర్డనేటర్ లగడపాటి ప్రభాకర్, కోర్డనేటర్ యు.శ్యాంబాబు, రీజన్ చింతోజు నాగేశ్వరరావు, కార్యదర్శి చెరుకూరి శ్రీనివాస్‌రావు, కోశాధికారి గద్దె నీరజ పాల్గొన్నారు. కాగా వైరాకు చెందిన పఠాన్‌గౌస్‌బేగం,షేక్ చెన్నపుల్లాబిలకు కుట్టు మిషన్లు అందచేశారు.

